స్పందనలో అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ సృజన, జెసి మౌర్య

‘ఉపాధి’ భిక్ష కాదు.. హక్కు..

- ఐక్యంగా పోరాడి హక్కును రక్షించుకోవాలి
- అదాని ఆస్తులు పెరిగినంతగా ‘ఉపాధి’ బడ్జెట్ పెరగడం లేదు
- వ్యవసాయ కార్మిక సంఘం ధర్నాలో బీవీ.రాఘవులు - ధర్నా అనంతరం ప్రదర్శన, కలెక్టర్‌కు వినతి

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

జాతీయ ఉపాధి హామీ చట్టం పాలకుల భిక్ష కాదని అదిపోరాడి సాధించుకున్న హక్కు అని, కలిసికట్టుగా పోరాడి హక్కును రక్షించుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం మాజీ ఉపాధ్యక్షులు, సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బివి.రాఘవులు అన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అలసత్వం వహిస్తున్నాయని, పేదలకు వరంగా ఉన్న పథకానికి తూట్లు పొడుస్తూ కనీసం రూ.70వేల కోట్లబడ్జెట్ కూడా కేటాయించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆధాని ఆస్తులు పెరిగినంత వేగంగా పేదల కడుపు నింపే పథకం బడ్జెట్ మాత్రం పెరగడం లేదని అన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఉపాధి హామీ చట్టం నిర్వీర్యాన్ని వ్యతిరేకిస్తూ కర్నూలు ధర్నా చౌక్‌లో ధర్నా చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వీర శేఖర్ అధ్యక్షతన జరిగిన ధర్నాలో బివి.రాఘవులుమాట్లాడారు. దేశంలో ఆనాడు పేదల ఆకలికేకలు వారి వలసలు నివారణకు 40 కోట్ల వ్యవసాయ కూలీల ఉపాధిని దృష్టిలో పెట్టుకుని వామపక్ష పార్టీల ఉద్యమంలో భాగంగా సాధించిన ఉపాధి హామీ చట్టాన్ని ప్రస్తుత కేంద్రం నిర్వీర్యం చేస్తుందన్నారు. ఇప్పటికే దాదాపు 40 శాతం జాబ్ కార్డులను తొలగించారన్నారు. వారం రోజులు పని చేస్తే నాలుగు రోజులు లెక్క కట్టి కూలిని ఇస్తున్నారన్నారు. 100 రోజులకు 80 రోజులే పనులు కల్పిస్తున్నారన్నారు. ఉపాధి హామీ ఎవ్వరికీ ఇష్టం లేదని, ఈ పథకాన్ని తీసేయాలి అనే అబద్ధపు ప్రచారాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్నాయన్నారు. వ్యవసాయ కూలీలు, చిన్న సన్నకారు రైతులు పేదలు కలిసికట్టుగా ఉపాధిని రక్షించుకోవాలన్నారు. ఉపాధి హామీ భిక్ష కాదని మనం సాధించుకున్న హక్కు అని దీనిని నిర్వర్యం చేస్తే సహించేది లేదన్నారు. కలిసికట్టుగా మన హక్కు సాదించుకోవడం కోసం మరిన్ని పోరాటాలు చేయాలన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కెవి నారాయణ మాట్లాడుతూ జిల్లాలో అన్ని మండల కేంద్రాల్లో గ్రామాల్లో ఉపాధి హామీ పనులను పరిశీలించామన్నారు. అక్కడ పేదలకు ఉపాధి హామీ పథకం కడుపు నింపుతుందని తెలిపారు. వలసలు వెళ్లకుండా వేసవిలో ఉపాధి పథకం ఉండటం వల్ల పేదలు బతుకుతుంటే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మాత్రం ఈ పథకాన్ని నిర్వీర్యం చేసేలా కుట్రలు పన్నుతున్నాయన్నారు. జిల్లాలో రూ.17 లక్షల బకాయిలు పెండింగులో ఉన్నాయన్నారు. వేసవి అలవెన్స్ అమలు

కర్నూలు నగరంలో ఉపాధి కూలీల ధర్నాను ఉద్దేశించి మాట్లాడుతున్న బివి.రాఘవులు

చేయాలన్నారు. పనిప్రదేశాల్లో నీళ్ల, నీడ ప్రథమ చికిత్స చేసేలా మెడికల్ సదుపాయాలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ మాట్లాడుతూ ఉపాధి హామీని నిర్వీర్యం చేస్తే సహించేది లేదన్నారు. ఇప్పటికే రూ.36 వేల కోట్లు కోత పెట్టారని, రెక్కాడితే డొక్కాడని పేదల పథకాన్ని హరించడం సరైంది కాదన్నారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో కూడా కేంద్రం కులం,మతం చిచ్చు పెట్టి తగాదాలు పెట్టేలా వ్యవహరిస్తోందన్నారు. ఉపాధి కూలీల ఆందోళనకు సిఐటియు ఎప్పటికి సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. ధర్నా చౌక్ నుండి కలెక్టరే వరకు ర్యాలీగా వచ్చి కలెక్టర్‌కు డిమాండ్లతో కూడిన వినతిని అందించారు. కలెక్టర్ స్పందించి మాట్లాడుతూ పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలని సంబంధిత అధికారులకు సూచించారు. పని ప్రదేశంలో గాయపడిన మహిళకు మంచి వైద్యం అందించాలని డిఎంహెచ్‌ఒను ఆదేశించారు. ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేషులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు తిక్కన్న, లింగన్న, బాలకృష్ణ, నాగన్న, సిఐటియు జిల్లా కార్యదర్శి అంజిబాబు, సిపిఎం నగర కార్యదర్శులు రాజశేఖర్, రాముడు, రజక వత్తి దారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గురు శేఖర్, తాండ్రపాడు సర్పంచి బాలపీర, నాయకులు సుభాన్ ,షరీఫ్ , విజయ్ ,రాఘవేంద్ర, ఉపాధి హామీ కూలీలు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సమస్యలు తెలుసుకుంటున్న బివి.రాఘవులు

కలెక్టర్ గరం.. గరం...

- అధికారుల తీరుపై అసహనం
- అర్జీలు నమోదు చేసే ఆపరేటర్లపై ఆగ్రహం
- ఇద్దరికి షోకాజు నోటీసులు జారీ

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

స్పందన కార్యక్రమం పట్ల జిల్లా అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టర్ కూర్చొని ఉన్నప్పటికీ అధికారులు అందరూ వెళ్లిపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. కలెక్టర్ పోస్టు అంటే అంత చులకనగా చూస్తున్నారా అంటూ అధికారులపై మండిపడ్డారు. ఇదే వ్యవహార శైలి అవలంభిస్తే మొత్తం అధికారులను వేరే జిల్లాలకు బదిలీ చేసి ఇక్కడికి కొత్త వారిని నియమించుకుంటామని పేర్కొన్నారు. అలాగే స్పందన అర్జీల రిజిస్ట్రేషన్ నమోదులో ఆపరేటర్లు వివరిస్తున్న తీరుపై కూడా మండిపడ్డారు. ఆపరేటర్లు సరిగ్గా అర్జీలను నమోదు చేయకపోవడంతో కలెక్టర్ మండి పడ్డారు. రిజిస్ట్రేషన్ సరిగ్గా చేయకపోవడంతో ఒకే దరఖాస్తులు మాటిమాటికి వస్తున్నాయని పేర్కొన్నారు. ఇదే వ్యవహార శైలి వ్యవహరిస్తే అందరినీ సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. డిఆర్‌డిఎ, సమగ్ర శిక్ష అభియాన్ శాఖలకు చెందిన ఆపరేటర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని డిఆర్‌ఒను ఆదేశించారు. విఆర్‌ఒలు, ఎఒలు ఇక నుంచి స్పందన పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు జెసి నారపురెడ్డి మౌర్య, ఇతర ఉన్నతాధికారులతో కలిసి బాధితుల అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలోని ప్రజలు సుదూర ప్రాంతాల నుంచి స్పందన కార్యక్రమానికి వస్తుంటారని తెలిపారు. వారికి న్యాయం జరిగేలా ప్రతి అధికారి శ్రద్ధతో వారు ఇచ్చిన దరఖాస్తులు పరిశీలించి నాణ్యతగా పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలు సమర్పించే అర్జీదారులు మొదటగా కంప్యూటర్ ఆపరేటర్ల దగ్గర రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, అనంతరం ఆ దరఖాస్తును సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. దరఖాస్తుదారులు అర్జీలు రిజిస్టర్ చేయించుకునే సమయంలో కంప్యూటర్ ఆపరేటర్లు సక్రమంగా రిజిస్టర్ చేయడం లేదన్నారు. పురపాలక శాఖ వారు కలెక్టరేట్ సముదాయాన్ని పరిశీలించాలని చెప్పారు. అపరిశుభ్రంగా ఉన్న కార్యాలయాలపై రూ.లక్ష జరిమానా విధించాలని పురపాలక శాఖ అసిస్టెంట్ కమిషనర్‌ను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని అన్ని శాఖల కార్యాలయాలను శుభ్రంగా ఉంచుకునేలా చర్యలు తీసుకోవాలని డిఆర్‌ఒ నాగేశ్వరరావును ఆదేశించారు.

కర్నూలులో టెన్షన్.. టెన్షన్

- సిబిఐ బృందం రాకతో ఉత్కంఠ
- అవినాష్ రెడ్డి అరెస్ట్ కోసం అంటూ ప్రచారం
- రాత్రికి అరెస్టు చేసే అవకాశం

ప్రజాశక్తి - కర్నూలు క్రైం

కర్నూలులో సోమవారం ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. సిపిఐ బందం రాకతో వాతావరణం వేడెక్కింది. వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో ఎంపీ అవినాష్ రెడ్డిని అరెస్ట్ చేస్తారంటూ ప్రచారం జోరుగా సాగడంతో అవినాష్ రెడ్డి తల్లి లక్ష్మమ్మ చికిత్స పొందుతున్న కర్నూలు విశ్వ భారతి ఆసుపత్రి వద్దకు ఆదివారం అర్ధరాత్రి నుంచే వైసిపి నాయకులు పెద్ద ఎత్తున చేరుకున్నారు. ఆస్పత్రివద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో పోలీసులు పెద్ద ఎత్తున మోహరించారు. ఆస్పత్రి వద్దకు వెళ్లే మార్గాన్ని పోలీసులు ఆధీనంలోకి తీసుకొని పహారాకాశారు. కొత్త వ్యక్తులను ఎవరిని లోపలికి అనుమతించలేదు. సోమవారం ఆరుగురు సిబిఐ అధికారులు కర్నూలు నగరానికి చేరుకున్నారు. కర్నూలు ఎస్‌పి జి. కష్ణకాంత్ తో సుదీర్ఘ చర్చలు జరిపారు. మూడుసార్లు నోటీసులు ఇచ్చినా అవినాష్‌రెడ్డి విచారణకు హాజరు కాకపోవడంతో అరెస్టు చేసేందుకు సిద్ధమవుతున్నట్టు ఎస్‌పికి తెలిపినట్లు సమాచారం. అవినాష్‌రెడ్డి ని అరెస్ట్ చేస్తే శాంతి భద్రతలకు విఘాతం కలిగే అవకాశం ఉందని ఎస్‌పి సిబిఐ అధికారులకు తెలిపినట్లు తెలుస్తోంది. దీనిపై డిజిపిని సంప్రదిస్తామని ఎస్‌పి చెప్పినట్లు సమాచారం.

వివరాలు ప్రధాన సంచికలో...

డ్వాక్రా మహిళలు ఐక్యంగా పోరాడాలి

- ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమాదేవి

ప్రజాశక్తి -కర్నూలు కార్పొరేషన్

డ్వాక్రా మహిళలు ఐకమత్యంతో హక్కులు సాధించుకోవాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి పొదుపు సంఘాలకు పిలుపు ఇచ్చారు. సోమవారం కర్నూలు సుందరయ్య భవన్‌లో డ్వాక్రా పొదుపు సంఘాలు, ఐద్వా జిల్లా కమిటీలు సంయుక్తంగా డ్వాక్రా సంఘాలు ఎదుర్కొంటున్న సమస్యలపై సదస్సు నిర్వహించారు. జి.ధనలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో డి.రమాదేవి మాట్లాడుతూ జగనన్న ఆసరా పథకాన్ని అందరికీ సమానంగా అమలు చేయాలన్నారు. నాలుగు విడతలుగా జగనన్న ఆసరా పథకాన్ని అమలు చేస్తామని చెప్పిన ప్రభుత్వం మొదటి విడతలో 90 లక్షల మందికి రుణ విముక్తి కల్పించిందన్నారు. ప్రభుత్వం మూడో విడతలో2023 ఏప్రిల్‌లో విడుదల చేసిన జగనన్న ఆసరా పథకంలో 80 లక్షల మంది సభ్యులు ఉండగా కేవలం 74 లక్షల మందికి రుణ విముక్తి కల్పించడం సరి కాదన్నారు. మిగిలిన 14 లక్షల మందికి వెంటనే ఆసరా పథకాన్ని అమలు చేయాలని ఆమె ప్రభుత్వాన్ని కోరారు. సున్నావడ్డీ పథకాన్ని రూ.మూడు లక్షలకే పరిమితి చేయడం భావ్యం కాదని, జగన్ మహిళలకు మరింత ఆసరా ఇవ్వడానికి ఈ పథకాన్ని రూ.10 లక్షలు వరకు అమలు చేయాలని ఆమె కోరారు. పొదుపు మహిళలు బ్యాంకులో లోన్ తీసుకున్నప్పుడు బ్యాంక్ అధికారులు కచ్చితంగా డిపాజిట్ చేయాలని ఒత్తిడి తెస్తున్నారని, పొదుపు లోన్లు తీసుకోకుండా అడ్డుపడుతున్నారని బ్యాంక్ అధికారులు ఇలాంటి వైఖరి మానుకోవాలని ఆమె కోరారు. అభయ హస్తం పథకం కలిగిన పొదుపు మహిళలకు పెన్షన్ పొందడానికి అర్హత ఉన్నా పెన్షన్లు ఇవ్వకపోవడం బాధాకరమని, అర్హత కలిగిన పొదుపు సంఘాల మహిళలకు పెన్షన్లు అమలు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్పీల మెడ పై కత్తి పెట్టి పనిచేయుచుకుంటుందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. పొదుపు సంఘాల సమన్వయం, సాధికారకత కోసం ఆర్‌పిలను ప్రభుత్వం నియమించిందని తెలిపారు. ఆర్‌పి లపై ప్రభుత్వ ఉద్యోగుల కంటే విపరీతమైన పనిభారం పెంచి 24/7 గంటలు పని చేయించుకుంటున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్‌పిల పట్ల ప్రభుత్వం మెప్మా అధికారులు కఠిన వైఖరితో కాకుండా సానుకూలంగా ఆలోచించాలని కోరారు. ప్రభుత్వ స్కీములన్నీ అధికారులు ఆర్‌పిల తో చేయిస్తున్నారని అన్నారు. కానీ వారి కుటుంబ, ఆర్థిక ఇబ్బందులను జగన్ ప్రభుత్వం గమనంలోకి తీసుకోవడం లేదని ఆమె తెలిపారు. ఆర్‌పిలతో పొదుపు సంఘాల పని కాకుండా బయటి ప్రాంతాలకు వీళ్ళను పనిలో నియమించేటప్పుడు వారికి టిఎ ఇవ్వాలని, ప్రభుత్వం అదనంగా పని చేయించు కున్నప్పుడు అదనపు పనికి అదనపు వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆర్‌పిలపై పని భారం తగ్గించాలని ఆమె ప్రభుత్వాన్ని కోరారు. ఐద్వా జిల్లా కార్యదర్శి ఎన్.అలివేలు, ఐద్వా నగర కార్యదర్శి కె.అరుణ, డ్వాక్రా సంఘాల నాయకురాలు షబానా, రషీదాదేశాయ్ పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్నఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమాదేవి

ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి-పత్తికొండ

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా పరిపాలన కొన సాగిస్తున్నారని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పేర్కొన్నారు. సోమవారం పత్తికొండ మండలం హోసూరు గ్రామంలో ఎమ్మెల్యే శ్రీదేవి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. 9వ వార్డులో కాలనీ ఏర్పడి 15 ఏళ్లు అయినప్పకీ సిసి రోడ్లు లేక డ్రైనేజీ రోడ్లపై ఆగి దోమలు చేరి అనారోగ్యాలకు గురవుతున్నామని కాలనీవాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే పరిష్కరించాలని ఉన్నతాధికారులకు ఆదేశాలిచ్చారు. పత్తికొండ ఎంపిపి నారాయణ దాసు, వైసిపి నాయకులు బనగాని శ్రీనివాసులు, కన్వీనర్ బళ్లారి మోహన్‌కృష్ణ ,సర్పంచి ఆముదాల నాగప్ప మండల కన్వీనర్ కారం నాగరాజు ఎంపిటిసి నెట్టేకల్లు ప్రభుత్వ అధికారులు సిబ్బంది, వైసిపి నాయకులు కార్యకర్తలు వాలెంటరీలు తదితరులు పాల్గొన్నారు.

ఎర్రమట్టి అక్రమ రవాణా ఆపాలని స్పందనలో ఫిర్యాదు చేస్తున్న స్థానిక ప్రజలు

ఎర్రమట్టి అక్రమ రవాణా ఆపాలని ఫిర్యాదు

ప్రజాశక్తి-సి బెళగల్

సి బెళగల్ కొండల్లో అక్రమార్కులు ఎర్రమట్టి అక్రమ రవాణాతో ప్రభుత్వ ఆదాయానికి భారీ గండీ కొడుతున్నారని గ్రామస్తులు స్పందనలో సోమవారం ఫిర్యాదు చేశారు. అది కూడా ఎక్కడ పడితే అక్కడ తవ్వడం వలన అక్కడక్కడ పెద్ద గుంతలు ఏర్పడి మేతకోసం వెళ్లిన మూగ జీవాలు ప్రమాదాలకు, ప్రాణాలకు ముప్పు కలుగుతోందని అధికారులతో తెలిపారు. రాత్రి వేళ అతి వేగంగా వెళ్తూ, నిద్రాభంగం చేస్తూ, దోచుకొంటున్నారని చర్యలు చేపట్టాలని కోరారు.

జర్నలిస్టులపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

కల్లూరు తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న సత్యనారాయణ, విజయ్‌కుమార్, పరమేష్

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలు నగరంలోని విశ్వభారతి హాస్పిటల్‌లో కవరేజీకి వెళ్ళిన జర్నలిస్టులపై దాడులకు పాల్పడిన కడప ఎంపీ అవినాష్ రెడ్డి అనుచరులను, దాడికి ప్రోత్సహించిన పెద్దలను వెంటనే అరెస్టు చేయాలని ఎపిడబ్ల్యుజెఎఫ్ పాణ్యం నియోజకవర్గం కమిటీ కార్యదర్శి నీలం సత్యనారాయణ, కల్లూరు మండల కార్యదర్శి పరమేష్ డిమాండ్ చేశారు. సోమవారం కల్లూరు మండల తహశీల్దార్ టివి. రమేష్ బాబుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వార్తల సేకరణలో భాగంగా కర్నూలు నగరంలోని విశ్వభారతి హాస్పిటల్‌కు వెళ్లిన ఈనాడు రిపోర్టర్ రామకృష్ణ రెడ్డి, ఆంధ్రజ్యోతి రిపోర్టర్ వెంకటేష్, ఆర్ టివి. కెమెరామెన్లు చంద్రశేఖర్, నాగేష్‌లపై దాడి చేసి కెమెరాలను పగలగొట్టడం పట్ల తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇది ప్రజాస్వామ్యానికి పెను ప్రమాదమని చెప్పారు. ఇలాంటి ఘటనలను ముక్తకంఠంతో ఖండించకపోతే భవిష్యత్తులో మరిన్ని దాడులు జరిగే అవకాశం ఉందని అన్నారు. సమాజంలో ఇలాంటి రాజకీయ నాయకుల వల్ల జరుగుతున్న అన్యాయాలు వెలుగులోకి వచ్చే అవకాశం లేదన్నారు. అదే జరిగితే పేద, మధ్యతరగతి ప్రజలు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. కావున ఈ దాడులను జర్నలిస్టులతో పాటు వివిధ పార్టీల నేతలు ప్రజా సంఘాల నేతలు ముక్తకంఠంతో ఖండించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో పాణ్యం నియోజకవర్గం ఉపాధ్యక్షులు విజయ్ కుమార్, సహాయ కార్యదర్శి పి.నాగేంద్రుడు, మండల కోశాధికారి శ్రీనివాసులు, నాయకులు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు

దాడి చేసిన వారిని తక్షణమే అరెస్టు చేయాలి: ఎపిడబ్ల్యుజెఎఫ్

తుగ్గలి : ఎంపీ అవినాష్ రెడ్డి అనుచరులు మీడియా సిబ్బందిపై దాడి చేయడం సరికాదని అటువంటి వారిని తక్షణమే అరెస్టు చేసి శిక్షించాలని ఎపిడబ్ల్యుజెఎఫ్, ఎపిడబ్ల్యుజె, టిడిపి నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రమైన తుగ్గలి తహశీల్దార్‌కు వినతి పత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ ఎంపీ అవినాష్ రెడ్డి అనుచరులను తక్షణమే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్రనాయకులు నాగలింగన్న, జర్నలిస్టులు మురళి, శేఖర్, హరిచంద్రా రెడ్డి, మధు, టిడిపి నాయకులు ప్రకాష్, వల్లే వెంకటేష్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాగలింగం తదితరులు

ఇంటర్ సప్లమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ : జిల్లా లో ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆర్‌ఐఒ ఎస్‌విఎస్. గురువయ్య శెట్టి పేర్కొన్నారు. సోమవారం కర్నూలు ఆర్‌ఐఒ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ. ఇంటర్మీడియట్ జనరల్, ఒకేషల్ విద్యార్థులకు అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా ఈ నెల 24 నుండి జూన్ 1 వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉమ్మడి కర్నూల జిల్లాలో ఇంటర్మీడియట్ సప్లమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కర్నూల్ జిల్లాలో 53 సెంటర్లలో 16,865 మంది ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలకు, 8694 మంది రెండవ సంవత్సరం పరీక్షలకు మొత్తం 25559 మంది విద్యార్థులు హాజరుకానున్నారని తెలిపారు. ఇందులో 23492 మంది జనరల్, 2,067 మంది ఓకేషనల్ విద్యార్థులు ఉన్నారని తెలిపారు. నంద్యాల జిల్లాలో 34 పరీక్షా కేంద్రాల్లో 14391 పంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. ప్రథమ సంవత్సరంలో 8743, ద్వితీయ సంవత్సరంలో 5648మంది విద్యార్థులు రాస్తున్నారు. అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు రెండు సెషన్ లలో ఉ.9.00 గం. ల నుండి మ 12.00 గం.ల వరకు మొదటి సంవత్సరం, మ.2.30 గం.ల నుండి సా.5.30 ల వరకు రెండవ సంవత్సరం పరీక్షలు ఉంటాయన్నారు. ఈ పరీక్షలను ప్రశాంత వాతావరణ నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఈ సమావేశంలో జిల్లా పరీక్షల విభాగం సభ్యులు పరమేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌ఐఒ గురువయ్య శెట్టి

6వ వార్డులో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న టిజి.భరత్

ప్రజలందరికీ సంక్షేమ పథకాలు : టిజి.భరత్

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

తాను ఎమ్మెల్యే అయిన వెంటనే అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తానని కర్నూలు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి టిజి.భరత్ అన్నారు. నగరంలోని 6వ వార్డులో ఆయన వార్డు పర్యటన చేపట్టి ఇంటింటికి వెళ్లి ప్రజలను కలిశారు. ప్రజలు పారిశుధ్య సమస్యలు, పెన్షన్, విద్యుత్, ఆరోగ్యశ్రీ సమస్యలను టిజిభరత్‌కు వివరించారు. అనంతరం టిజి భరత్ మాట్లాడుతూ కర్నూలులో అర్హులకు కూడా సంక్షేమ పథకాలు అందడం లేదని చెప్పారు. తనతో పాటు ఎమ్మెల్యే, అధికారులు కలిసి వార్డుల్లోకి వస్తే ప్రజల సమస్యలు అర్థమవుతాయన్నారు. ఇక్కడ పార్టీలను పక్కనపెట్టి ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు అందరం కలిసి పనిచేద్దామని తాను కోరుతున్నట్లు చెప్పారు. రాజకీయాలు అవసరం లేదని, అందరం కలిసి ప్రజల సమస్యలను పరిష్కరిద్దామన్నారు. క్షేత్రస్థాయికి వెళ్తే ప్రజలు పడుతున్న ఇబ్బందులు ఏంటో అధికారులకు, ప్రజాప్రతినిధులకు తెలుస్తాయన్నారు. వర్షం వస్తే విద్యుత్ షాక్ తగిలేటట్లు వార్డులో పరిస్థితులు ఉన్నాయన్నారు. ప్రమాదాలు జరగకముందే ముందస్తుగా స్పందించి ప్రజల సమస్యలు పరిష్కరిస్తే బాగుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు జహంగీర్‌బాష, ఇబ్రహీం, మెహబూబ్ నయీమ్, గౌస్, సలీం, ఖాదర్, జుబెయిర్, ఫయాజ్, అబ్దుల్లా, ఇతర నేతలు పాల్గొన్నారు.

గంగావతి నగర్ చర్చి దగ్గర వీధిలైట్లు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్ : 32 వ వార్డు గంగావతి నగర్ చర్చి దగ్గర ఉన్న గృహాలకు కరెంటు పోల్స్ వేసి వీధిలైట్ల సౌకర్యం కల్పించడం కోసం నిధులు మంజూరు చేయాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో నగర కార్యదర్శి వర్గ సభ్యులు కె.సుధాకరప్ప ,కార్యదర్శి ఎం. లక్ష్మయ్య, ఎస్. అక్బర్‌బాషా కలిసి కమిషనర్ భార్గవ్ తేజకు స్పందనలో వినతి పత్రం అందజేశారు. కె.సుధాకరప్ప మాట్లాడుతూ గంగావతి నగర్ చర్చి దగ్గర గత 20 యేళ్లుగా పేదలు నివాసం ఉంటున్నారని తెలిపారు. అక్కడ 10 గృహాలకు విద్యుత్ సౌకర్యం ఉన్న కరెంటు పోల్స్ లేక వీధిలైట్లు లేక అనేక అవస్థలు పడుతున్నారని తెలిపారు. గతంలో కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించామని, ఎలక్ట్రికల్ డిపార్ట్ మెంట్ వారికి ఎస్టిమేషన్ కొరకు పంపగా సంబందిత అధికారులు ఎస్టిమేషన్ వేసి మున్సిపల్ కమిషనర్‌కు పంపారని తెలిపారు. కానీ ఇంతవరకు అమౌంట్ చెల్లించలేదని తెలిపారు. కమిషనర్ వెంటనే అమౌంట్ చెల్లించి విద్యుత్ సౌకర్యం కల్పించాలని వీధిలైట్లు వేయాలని కోరారు. కమిషనర్ భార్గవ్ తేజ స్పందించి నిధులను మంజూరు చేయడానికి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

స్పందన అర్జీలను సత్వరమే పరిష్కరించండి

- సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్

ప్రజాశక్తి - ఆదోని

అర్జీలను స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్

స్పందన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన నిర్వహించారు. డివిజన్ స్థాయిలో అర్జీలను స్వీకరిస్తూ సంబంధిత అధికారులకు ఎండార్స్‌మెంట్ చేశారు. సోమవారం వచ్చిన అర్జీలను నిర్ణీత గడువులోపు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బియాండ్ ఎస్ఎల్ఎకి వెళ్లకుండా చూసుకోవాలని తెలిపారు. డిప్యూటీ తహశీల్దార్ రమాదేవి, పౌర సరఫరాల ఉప తహశీల్దార్ వలీబాష, ఉప తహశీల్దార్ (రీ సర్వే) కౌసర్ భాను, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణు సూర్య, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ చేతన్ ప్రియా, బీసీ వెల్ఫేర్ లక్ష్మీనారాయణ, ఆర్‌టిసి డిఎం మహ్మద్ రఫీ, గృహ నిర్మాణ శాఖ డిప్యూటీ ఇంజినీర్ రవికుమార్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

వాల్మీకి మహర్షి మహనీయుడు

- టిడిపి మాజీ ఇన్‌ఛార్జీ గుడిసె కృష్ణమ్మ

ప్రజాశక్తి - ఆదోని

పూజలు నిర్వహిస్తున్న గుడిసె కృష్ణమ్మ

వాల్మీకి మహర్షి మహనీయుడని నాయకులు పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని కల్లుబావిలో వాల్మీకి మహర్షి విగ్రహావిష్కరణ కార్యక్రమం చేపట్టారు. మహర్షి వాల్మీకి విగ్రహానికి ఎమ్మెల్యే వై.సాయి ప్రసాద్ రెడ్డి, టిడిపి మాజీ ఇన్‌ఛార్జీ గుడిసె కృష్ణమ్మ, సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు, మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ జైన్, మున్సిపల్ ఛైర్మన్ శాంత పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వారు మాట్లాడారు. వాల్మీకి మహర్షి, ఆయన జీవన విధానం, జీవనశైలి నేటి తరానికి బాసటగా నిలిచాయని కొనియాడారు. రామాయణం వాల్మీకి మహర్షి రాయకపోతే మనందరికీ తెలిసేది కాదన్నారు. అలాంటి మహానుభావుని వారసులైన వాల్మీకులందరూ కలిసికట్టుగా ఉండి సమస్యలు పరిష్కరించుకోవాలని తెలిపారు. ఎస్టీ రిజర్వేషన్ సాధన కోసం మరింత ఉధృతంగా పోరాటాలు చేయాలని కోరారు. వాల్మీకులను ఎస్టీలుగా గుర్తించి అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపించినట్లు ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ వివరించారు. వైసిపి పట్టణ అధ్యక్షులు బి.దేవా, చంద్రకాంత్ రెడ్డి, కామాక్షి తిమ్మప్ప, సింహం నాగేంద్ర, కామాక్షి నారాయణ, వాల్మీకి నాయకులు స్కూల్ ఛైర్మన్ రాజు, మల్లికార్జున, శ్రీనివాసులు, చిన్నస్వామి, వీరేష్, శంకరమ్మ, డ్రమ్ము వీరేష్, గోల్డ్ ఈరన్న, శేఖర్ కుమార్, వీరభద్ర రెడ్డి, మాధవరెడ్డి, షేక్షావలి ఉన్నారు.

ఖాతాదారుని సొమ్ము అపహరణ

- విచారిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి-ఆలూరు

బ్యాంకులో సిసి ఫుటేజీని పరిశీలిస్తున్న సిఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ నాయక్

ఆలూరు పట్టణంలోని స్టేట్ బ్యాంకు ముందు ఖాతాదారుడు డ్రా చేసిన రూ.3 లక్షలను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకు పోయారు. ఆలూరు పట్టణానికి చెందిన విశ్రాంత బ్యాంకు ఉద్యోగి గోవిందు సోమవారం బ్యాంకుకు వెళ్లి రూ3. లక్షలు డ్రా చేసుకొని బయటకు వచ్చారు. బ్యాంకు బయట ఉన్న తన ద్విచక్రవాహనానికి ఉన్న సైడ్ బ్యాగ్‌లో రూ.3 లక్షలు పెట్టారు. అప్పటికే ఆయనను గమనిస్తూ వెంబడిస్తున్న కొందరు తెలియని వ్యక్తులు ఆయన బండికి మరో స్కూటర్‌లో అడ్డుగా వచ్చారు. వెనుకల నుంచి వచ్చిన ఆ వ్యక్తులు ఆయనతో మాటలు కలిపారు. మాట్లాడుతుండగానే సైడ్ బ్యాగ్‌లో ఉన్న డబ్బును దొంగలించుకొని వెళ్లి పోయారు. ఇంటికి వెళ్లి చూడగానే ఒక్క సారిగా షాక్‌కు గురైన గోవిందు లబోదిబోమంటూ బ్యాంకు వద్దకు పరుగులు తీశారు. బ్యాంకు అధికారులకు ఫిర్యాదు చేయగా వారు పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న సిఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ డాక్టర్ నాయక్ బ్యాంకుకు చేరుకొని బాధితుని విచారించారు. బ్యాంకులో ఉన్న సిసి ఫుటేజీతో పాటు బ్యాంకు పక్కన ఉన్న దుకాణాల్లో ఉన్న సిసి కెమెరాలను పరిశీలించారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. బ్యాంకు సిసి ఫుటేజీలో అనుమానితులుగా ఉన్న వారిని పోలీసులు విచారిస్తున్నారు.

మతోన్మాదాన్ని విద్యార్థులు తిప్పికొట్టాలి

- విద్యారంగంలో లోపాలను గుర్తించని నూతన విద్యా విధానం
- ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు గౌస్ దేశాయి - ముగిసిన విద్యా వైజ్ఞానిక శిక్షణ తరగతులు

ప్రజాశక్తి - గోనెగండ్ల

మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ నాయకులు గౌస్ దేశాయి

ప్రస్తుతం దేశంలో మతోన్మాదాన్ని కొన్ని శక్తులు పెంచి పోషించి వ్యాపింపజేస్తున్నాయని, వాటి పట్ల విద్యార్థులు అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండి తిప్పి కొట్టాలని ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ నాయకులు డి.గౌస్‌దేశాయి కోరారు. గోనెగండ్లలోని మోడల్ పాఠశాల ఆవరణలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు నిర్వహించిన విద్యా వైజ్ఞానిక శిక్షణ తరగతులు సోమవారం ముగిశాయి. చివరి రోజు మొదటి క్లాసు 'మతోన్మాదం - సమాజంపై దాని పాత్ర', రెండో క్లాసు 'సంఘ నిర్మాణం'పై గౌస్ దేశాయి విద్యార్థులకు బోధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రస్తుతం భారతదేశంలో రాజకీయ పబ్బం గడుపుకోవడానికి కొన్ని శక్తులు మతోన్మాదాన్ని పెంచి పోషిస్తున్నాయని తెలిపారు. ఇలాంటి విధానాలను తిప్పికొట్టాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన జాతీయ విద్యా విధానం-2020 విద్యా రంగంలోని లోపాలను గుర్తించలేక పోయిందని విమర్శించారు. విద్యార్థులు ధరించే దుస్తులపై ఆంక్షలు విధించడం, చరిత్రకారులు, స్వాతంత్ర్య సమరయోధుల పాఠ్యాంశాలను సిలబస్ నుంచి తొలగించడం ఎన్నో ఏళ్ల వెనక్కి వెళ్లినట్లు ఉందని తెలిపారు. ఇలాంటి సమయంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సామాజిక స్పృహ కలిగి నిబద్ధతతో మెరుగైన సమాజం కోసం పాటుపడాలని కోరారు. అనంతరం గోనెగండ్ల మోడల్ పాఠశాల ప్రిన్సిపల్ షాహినా పర్వీన్, గోనెగండ్ల మాజీ ఉప సర్పంచి టి.రవికుమార్ నాయుడు మాట్లాడారు. విద్యార్థులు విద్యలో చక్కగా రాణిస్తూ క్రమశిక్షణతో మెలిగి ప్రభుత్వ పాఠశాలలు విద్యా రంగ పరిరక్షణకు కృషి చేయాలని కోరారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రంగప్ప, ప్రధాన కార్యదర్శి అబ్దుల్లా, మండల నాయకులు వీరన్న, ఖాజా, నంది, యుటిఎఫ్ నాయకులు నరసింహులు, రామన్, జిక్రియా పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి, సంక్షేమానికి కృషి

- వైసిపి రాష్ట్ర యువ నేత ప్రదీప్ రెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రతి గ్రామంలో ఉన్న సమస్యల పరిష్కారానికి, ప్రజల సంక్షేమం కోసం గడపగడపకు తిరుగుతున్నామని వైసిపి రాష్ట్ర యువ నేత, మంచాల సింగిల్ విండో అధ్యక్షులు వై.ప్రదీప్ రెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని మాలపల్లి గ్రామంలో 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రవేశ పెట్టిన గడపగడపకు మన ప్రభుత్వం ద్వారా సమస్యలు తెలుసుకోవడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ అందుతున్నాయా లేదా అనే విషయాలు తెలుస్తాయని తెలిపారు. దీని కారణంగా అధికారుల ద్వారా సమస్యల పరిష్కారానికి కృషి చేయడం, సంక్షేమ పథకాల అమలుపై సమగ్ర సమాచారం అందుతుందని చెప్పారు. ఇంటింటికీ తిరిగి లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బుక్ లెట్‌ను అందజేశారు. వైసిపి మండలాధ్యక్షులు భీమిరెడ్డి, ఇన్‌ఛార్జీ విశ్వనాథ్ రెడ్డి, మాజీ జడ్‌పిటిసి లక్ష్మయ్య, నాయకులు గురురాజారావు

బుక్‌లెట్‌ను అందజేస్తున్న ప్రదీప్ రెడ్డి

ఈ రోడ్లు ఇంతేనా..?

- రోడ్లు బాగు లేవని రూట్ మార్చిన ఎపిఎస్ఆర్‌టిసి - ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్న పాలకులు
- ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఉత్తవేనా..?

ప్రజాశక్తి - హోళగుంద

ఇక ఈ రోడ్లు ఇంతేనా, రోడ్లు బాగా లేవని ఎపిఎస్ఆర్‌టిసి రూటు మార్చినా పాలకులు పట్టించుకోరా, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చరా అంటూ మండల ప్రజలు మండిపడుతున్నారు. కర్ణాటక సరిహద్దు గ్రామం మార్లమడికి, ధణాపురం నుంచి హోళగుంద రోడ్డు దుస్థితి వర్ణనాతీతంగా ఉంది. కర్ణాటక సరిహద్దులోకి అడుగు పెట్టడానికి 5 కిలోమీటర్లు మాత్రమే ఉంది. ఈ రోడ్లన్నీ గుంతలమయమై ఉండడంతో ఎక్కడికి వెళ్లాలన్నా సమయం వృథా అవుతోంది. నానా ఇబ్బందులు పడి గమ్యస్థానానికి చేరుకొని హమ్మయ్య గండం నుంచి గట్టెక్కామని, ఇక బయటపడ్డామని అనిపిస్తుందని ప్రయాణికులు చర్చించుకుంటున్నారు. మార్లమడికి రోడ్డులో ఎల్లార్తి దర్గాకు వచ్చే భక్తులు అధిక సంఖ్యలో కర్ణాటక రాష్ట్రం నుంచి ఇదే మార్గంలో చేరుకోవాల్సిన పరిస్థితి ఉంది. మార్లమడికి రోడ్డు భూమి పూజ కే పరిమితమయింది. వైసిపి ప్రభుత్వం ఏర్పడిన ఆరు నెలల తర్వాత మార్లమడికి రోడ్డుకు నిధులు కేటాయించామని, రూ.2.60 కోట్లు మంజూరయ్యాయని సంబంధిత శాఖ అధికారులతో కలిసి రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం భూమి పూజ చేశారు. ఇంతవరకూ నిర్మాణ పనులకు నోచుకోకపోవడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తోంది. మంత్రి శంకుస్థాపన చేశారని, ఇక రోడ్డు పనులు పూర్తవుతాయని మండల ప్రజలు భావించారు. భూమి పూజ చేసి రెండేళ్లయినా పనులు మొదలు పెట్టకపోవడంతో మండల ప్రజలు మండిపడుతున్నారు. హోళగుంద నుంచి ధణాపురం రోడ్డు కోసం రూ.69 కోట్లు మంజూరు చేశారు. గుత్తేదారులతోపాటు ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, కార్మిక శాఖ మంత్రి సోదరులు నారాయణస్వామి, శ్రీనివాసులు భూమి పూజ చేశారు. పనులు ప్రారంభమవుతాయో లేదోనని ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. రెండు, మూడు సార్లు కాంట్రాక్టర్లు పనులు మొదలు పెట్టడానికి వచ్చి మంత్రులు, ఎమ్మెల్యేలు పర్సెంటేజ్ అడగడంతో సందిగ్ధంలో పడ్డారు. వారికి పర్సెంటేజీలు ఇవ్వాలా..., నాణ్యతగా రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలా అని వెనక్కి తిరిగి వెళ్లినట్లు తెలిసింది. హోళగుంద మండలానికి చేరుకోవాలంటే ఏ రోడ్డులో చూసినా గుంతలు ఉండడంతో గర్భిణులు, రోగులు ఇబ్బందులు పడుతున్నారు. బళ్లారి, కర్నూలు వంటి జిల్లా కేంద్రాలకు వైద్య పరీక్షల నిమిత్తం వెళ్లాలంటే అవస్థలు పడుతున్నారు. సంబంధిత ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు బాగాలేదని రూటు మార్చిన ఆర్‌టిసి

ధణాపురం టూ హోళగుంద రోడ్డు ఎటు చూసినా గుంతలు ఏర్పడి అధ్వానంగా ఉంది. ఈ రోడ్డులో ఎపిఎస్ఆర్‌టిసి బస్సు తిప్పడం వల్ల గత నాలుగేళ్లుగా ఆదాయం కన్నా ఖర్చులు ఎక్కువయ్యాయని, రోజూ బస్సు ఏదో ఒక మరమ్మతుకు గురికావడంతో భరించలేకపోతున్నామని పేర్కొంటున్నారు. డ్రైవర్లు ఈ రోడ్డులో బస్సు నడపడం వల్ల అనారోగ్యానికి గురవుతున్నారని బహిరంగంగా చెబుతున్నారు. ఇలాంటి పరిస్థితి రావడానికి పాలకులు కారణం కాదా అని మండల ప్రజలు, ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. సంబంధిత ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి గుత్తేదారులతో చర్చలు జరిపి రోడ్ల మరమ్మతులు చేపట్టేందుకు కృషి చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు మరమ్మతులు చేపట్టాలని నిరసన తెలుపుతున్న యువకులు

'కేరళ స్టోరీ'ని నిషేధించాలి

- ఎంపిజె నాయకులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

దేశంలో మత సామరస్యాన్ని దెబ్బ తీస్తున్న 'కేరళ స్టోరీ' సినిమాను రాష్ట్రంలో నిషేధించాలని ఎంపిజె రాష్ట్ర సెక్రటరీ లాల్కోట్ మహ్మద్ ఖదిర్ బాష డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలో తహశీల్దార్ జయన్నకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ మధ్యకాలంలో భారతదేశంలో వాస్తవ కథ అని చెబుతూ అవాస్తవాలను సినిమాలుగా తీస్తూ మతసామరస్యాన్ని దెబ్బతీయాలని చూస్తున్నారని విమర్శించారు. అలాంటి వారికి కేంద్ర ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలవడం సిగ్గుచేటన్నారు. ఒక మతం వారిని లక్ష్యంగా చేసుకుని సినిమాలు తీయడం, వాటికి సంఘ్ పరివార్ మద్దతు పలకడం పరిపాటిగా మారిందని తెలిపారు. ఈ మధ్యనే అబద్ధాలు, కల్పనతో 'కాశ్మీర్ ఫైల్స్' అనే సినిమా తెరకెక్కించారని చెప్పారు. పూర్తి అవాస్తవాలతో, అభూత కల్పనతో ఒక మతాన్ని లక్ష్యంగా చేసుకుని తెరకెక్కించిన 'కేరళ స్టోరీ' సినిమా దేశంలో వివాదాస్పదమైందని తెలిపారు. ఈనెల 20లోపు నిర్మాతలు సినిమా సృజనాత్మక సృష్టిగా డిస్‌క్లయిమర్‌ను ప్రదర్శించాలని ఆదేశాలివ్వడం సినిమా అవాస్తవికతను తెలియపరుస్తుందని అన్నారు. ఇలాంటి వివాదాస్పదమైన సినిమాలకు క్లియరెన్స్ ఇస్తున్న కేంద్ర సెన్సార్ బోర్డుపై సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని ప్రక్షాళన చేయాలన్నారు. ఉమ్మడి జిల్లా అధ్యక్షులు ప్రవీణ్ కుమార్, అబ్దుల్ కలాం, తాహెర్, అబ్దుల్ రెహమాన్, ఉదయ్ పాల్గొన్నారు.

ఘనంగా ఉపాధ్యాయ ఉద్యమ నేత హనుమంతు వర్ధంతి

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో ఉపాధ్యాయ ఉద్యమ నేత, సిపిఎం నాయకులు హనుమంతు రెండో వర్ధంతి సభ సోమవారం సిపిఎం పట్టణ కార్యదర్శి వర్గసభ్యులు తిప్పన్న అధ్యక్షతన జరిగింది. అంతకుముందు హనుమంతు చిత్రపటానికి సిపిఎం పట్టణ కార్యదర్శి లక్ష్మన్న పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా లక్ష్మన్న, తిప్పన్న, వీరేష్ మాట్లాడారు. ఉపాధ్యాయ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషిస్తూ ఉపాధ్యాయ ఉద్యమాన్ని విస్తరిస్తూ యుటిఎఫ్ స్టేట్ కౌన్సిల్ సభ్యులుగా ఎన్నికయ్యారని తెలిపారు. విద్యార్థి, యువజన, దళితుల సమస్యలపై పోరాటాలు చేస్తున్న సంఘాలకు అండగా ఉంటూ పోరాటాలకు సహకారం అందించే వారని కొనియాడారు. హనుమంతు ఆశయ సాధన కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు.

బాల్య వివాహాలపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి - గోనెగండ్ల

గోనెగండ్లలోని వైకెపి డిఆర్‌డిఎ కార్యాలయంలో సోమవారం మహిళా సంఘాల సభ్యులతో బాల్య వివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా తహశీల్దార్ వేణుగోపాల్, ఎంపిడిఒ జి.నగేష్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ నాగేశ్వరమ్మలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రామాల్లో పెళ్లిళ్ల సీజన్ ప్రారంభమైనందున బాల్య వివాహాలు ఎక్కువగా జరుగుతుంటాయని తెలిపారు. మహిళలు సమాచారం వెంటనే ఉన్నతాధికారులకు తెలపాలని కోరారు. గ్రామల్లో మహిళలు ప్రతి నెలా గ్రూపు సమావేశంలో బాల్య వివాహాలపై మహిళలకు అవగాహన కల్పించాలని కోరారు. ఎపిఒ మహ్మద్ బాషా, ఈసీ ఉస్మాన్, సిసిలు లలిత, వీరకృష్ణుడు, వెంకన్న, ముక్కన్న పాల్గొన్నారు.

'రాయితీ విత్తనాలను సద్వినియోగం చేసుకోండి'

ప్రజాశక్తి - దేవనకొండ

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు గాను ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న వేరుశనగ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎఒ సురేష్ బాబు తెలిపారు. సోమవారం మండల వ్యవసాయ సలహా బోర్డు కమిటీ సమావేశం వ్యవసాయ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలానికి 2300 కింటాళ్ల విత్తనాలు కేటాయించినట్లు తెలిపారు. కింటా రూ.5,580గా ప్రభుత్వం ధర నిర్ణయించినట్లు చెప్పారు. ప్రతి ఆర్‌బికెకు స్టాక్ ఇవ్వనున్నట్లు తెలిపారు. వేరుశనగ విత్తనం కావాల్సిన రైతులు ఆర్‌బికెలో మొట్టమొదటగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. సీడ్స్, ఎరువుల దుకాణదారులు ఎవరైనా పత్తి విత్తనాలు ఎంఆర్‌పి కంటే అధిక ధరలకు విక్రయిస్తే సదరు స్టాక్‌ను సీజ్ చేసి లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. ఆర్‌బికె సిబ్బంది, సీడ్స్ డీలర్లు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి

- స్పందనలో కాలనీ వాసుల వినతి

ప్రజాశక్తి - హోళగుంద

మండలంలోని ముద్దాటమాగి గ్రామం ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు కోరారు. సోమవారం జరిగిన గ్రీవెన్స్‌లో ఎస్సీ కాలనీ వాసులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కాలనీలో దాదాపు 20 ఎస్సీ కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయని తెలిపారు. తమకు ఒక్క పబ్లిక్ కుళాయి కూడా పంచాయతీ కార్యదర్శి, సర్పంచి ఏర్పాటు చేయకపోవడం బాధాకరమన్నారు. వాడుకోవడానికి నీరు తెచ్చుకోవాలంటే 600 మీటర్ల వరకు వెళ్లి ట్యాంకు దగ్గర తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. తమ సమస్యను పలుమార్లు పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లినా పరిష్కరించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీటి సమస్య పరిష్కారం కాలేదంటే నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. సబ్ ప్లాన్ నిధుల ద్వారా ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులతో మాట్లాడి పైపులైన్ వేయించాలని ఎంపిడిఒ దాసును కోరారు.

జర్నలిస్టులపై దాడులు అమానుషం

- నిరసనగా ర్యాలీ

ప్రజాశక్తి - ఆదోని

జర్నలిస్టులపై దాడులు చేయడం అమానుషమని నాయకులు, జర్నలిస్టులు విమర్శించారు. అవినాష్ రెడ్డిని అరెస్టు చేసేందుకు సిబిఐ అధికారులు కర్నూలు జిల్లాకు రావడంతో అక్కడికి వెళ్లిన మీడియా ప్రతినిధులపై అవినాష్ రెడ్డి అనుచరులు దాడులు చేసి భౌతికంగా గాయపరిచారు. దీనిని వ్యతిరేకిస్తూ ఎపియుడబ్ల్యుజె రాష్ట్ర, జిల్లా కమిటీ పిలుపుమేరకు సోమవారం జర్నలిస్టు యూనియన్‌తో కలిసి రాజకీయ, ప్రజా సంఘాల నాయకులు నిరసన చేపట్టారు. ఈ నిరసనతో ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం దద్దరిల్లింది. అంతకుముందు స్థానిక ఎంపిడిఒ కార్యాలయం నుంచి భీమా సర్కిల్ వరకు ర్యాలీగా వెళ్లి నిరసన చేపట్టారు. సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా టిడిపి కర్నూలు పార్లమెంట్ జిల్లా ప్రధాన కార్యదర్శి భూపాల్ చౌదరి, జనసేన పార్టీ ఇన్‌ఛార్జీ ఎన్.మల్లప్ప, కాంగ్రెస్ అధ్యక్షులు దేవిశెట్టి ప్రకాష్, సిపిఎం నాయకులు లక్ష్మన్న మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో నిత్యం ప్రజల కోసం, ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాడుతున్న విలేకరులపై దాడులు సరైంది కాదని తెలిపారు. దాడులకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకొని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఆరెకల్ దేవదాసు, మహ్మద్ గౌస్, హుస్సేని, వెంకటేష్, విజయ్, రవిలు సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌కు వినతిపత్రం ఇచ్చారు. సీనియర్ జర్నలిస్టులు విజయేంద్రనాథ్ ప్రసాద్, మల్లికార్జున, రవి, ఎపియుడబ్ల్యుజె జిల్లా కార్యవర్గ సభ్యులు మహేష్ యాదవ్, టిడిపి నాయకులు జైరాం, సజ్జాద్, బాలాజీ, షణ్ముఖ, రవి చౌదరి, రవి, జనసేన నాయకులు తాహేర్ వలి, రాజశేఖర్ పాల్గొన్నారు. **చిప్పగిరి** తహశీల్దార్ కార్యాలయం దగ్గర ఎపియుడబ్ల్యుజె ఆధ్వర్యంలో ఎంపీ అవినాష్ రెడ్డి అనుచరులను అరెస్టు చేయాలని నిరసన చేపట్టారు. తహశీల్దార్ లక్ష్మీనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఆంధ్రజ్యోతి కృష్ణమూర్తి, విశాలాంధ్ర తిమ్మప్ప, ప్రజాశక్తి రవి, సాక్షి నీలకంఠ, సూర్య వెలుగు స్టేట్ బ్యూరో యూసుఫ్ పాల్గొన్నారు. **ఆలూరు**లోని అంబేద్కర్ సర్కిల్‌లో నిరసన చేపట్టారు. ర్యాలీగా తహశీల్దార్ కార్యాలయానికి వెళ్లి డిప్యూటీ తహశీల్దార్ విజయ్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. సిపిఎం నాయకులు కెపి.నారాయణ స్వామి, టిడిపి నాయకులు సి.నారాయణ రెడ్డి, సిపిఐ నాయకులు రామాంజనేయులు, జర్నలిస్టు నాయకులు స్వరూప్ మాట్లాడారు. ప్రజాసంఘాల నాయకులు షాకీర్, గోవర్ధన్, షఫీ, టిడిపి నాయకులు అశోక్, నారాయణ, నర్సప్ప, భాస్కర్, చంద్రశేఖర్, కొమ్ము రామాంజి, నాగరాజు, రాము, జర్నలిస్టులు శ్రీధర్, రాజేష్, రాంప్రసాద్, కృష్ణ, నాగరాజు, భీమా, గోపాల్, వీరేష్, ముని పాల్గొన్నారు. **మంత్రాలయం**లో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ పాలకుర్తి తిక్కారెడ్డి మాట్లాడారు. రాష్ట్రంలో రాజారెడ్డి వారి రాజ్యాంగం నడుస్తోందని మండిపడ్డారు. వైసిపి నాయకులు జర్నలిస్టులపై దాడి చేసి, కెమెరాలు ధ్వంసం చేయడం దారుణమన్నారు. అలాంటి వారిని వెంటనే అరెస్టు చేయాలని, దాడి చేసిన వారిపైనా, దాడికి ప్రోత్సహించిన వారిపైనా హత్యాయత్నం కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

ఆదోనిలో ప్రదర్శన నిర్వహిస్తున్న రాజకీయ నాయకులు, జర్నలిస్టులు

ఆలూరులో నిరసన చేపడుతున్న నాయకులు, జర్నలిస్టులు

చిప్పగిరి తహశీల్దార్ లక్ష్మీనారాయణకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నాడు-నేడుతో వెలుగులు

- మారిన ప్రభుత్వ పాఠశాల రూపురేఖలు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

నాడు-నేడు ద్వారా అదనపు గదుల నిర్మాణం

వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నాడు-నేడు కార్యక్రమం కింద ప్రభుత్వ పాఠశాలల్లో వెలుగులు నిండాయి. పాఠశాలల రూపురేఖలు మారాయి. ఈ క్రమంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలన్నింటినీ అభివృద్ధి చేస్తున్నారు. అలా అభివృద్ధి చెందిన పాఠశాలనే ఆదోని మండలంలో ధణాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల. గతంలో అక్కడ కొంతమంది విద్యార్థులతో మాత్రమే అరకొర వసతుల్లోనే విద్యాబోధన చేపట్టేవారు. ఉపాధ్యాయులు మంచిగా బోధన చేసినా విద్యార్థులకు సరైన మౌలిక వసతులు లేకపోవడంతో ఆ పాఠశాలకు వెళ్లలేక చదువులను మధ్యలో ఆపేసేవారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నాడు-నేడు కార్యక్రమంతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారాయి. గత కొన్ని సంవత్సరాల క్రితం నుంచి ఎప్పుడూ లేనివిధంగా ప్రభుత్వ పాఠశాలలు నూతన ఒరవడిని సంతరించుకున్నాయి. రెండో విడత నాడు-నేడు పనుల్లో భాగంగా రూ.56 లక్షలతో పాఠశాల చుట్టూ ప్రహరీ, నాలుగు అదనపు తరగతి గదులు, కిచెన్ రూమ్, పాఠశాలల భవనాలకు మరమ్మతులు చేయించడమే కాకుండా, ఆధునికత ఉట్టిపడేలా, విద్యార్థులకు ఉపయుక్తంగా ఉండేలా చాలా అందంగా తీర్చిదిద్దారు. విద్యార్థులను, తల్లిదండ్రులను ఆకర్షించడానికి కార్పొరేట్ పాఠశాలలు ఏ విధంగా పాఠశాలలను సిద్ధం చేస్తున్నాయో ప్రభుత్వ పాఠశాలలను సైతం సర్వాంగ సుందరంగా ముస్తాబు చేయిస్తున్నారు.

నాడు-నేడుతో పాఠశాలలో మౌలిక వసతులు

- ఎంవిబిఎస్.అనిల్ కుమార్, ప్రధానోపాధ్యాయులు

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన నాడు-నేడు ద్వారా పాఠశాలలో మౌలిక వసతులు కల్పిస్తున్నాం. మొత్తం పాఠశాలలో 300 మందికి పైగా విద్యనభ్యసిస్తున్నారు. 10వ తరగతి విద్యార్థుల విషయానికొస్తే జె.దివ్య 536, కె.వెన్నెల 523 మార్కులు సాధించారు.

IN THE COURT OF THE HON'BLE SENIOR CIVIL JUDGE AT ADONI
I.A No. 666 OF 2022
IN
O.S No 275 OF 2014

BETWEEN:
1.M.Narayanammma died by LRs. ...Plaintiff/Petitioners
AND
M. Naganjineyulu. ...Defendants/Respondents

NOTICE

To

Proposed Plaintiff No 8. Mrs Ramanjineyamma D/o Late M Narayana and M Narayanamma, aged about 50 years, Hindu, Cultivator, resident of House No. 3-13, Post Office Street, Tuggali Post, Tugalli, Kurnool District, A.P.

Proposed Plaintiff No 9. Mrs Nagarathanamma D/o Late M Narayana and M Narayanamma, aged about 48 years, Hindu, Cultivator, resident of House No. 3-13, Post Office Street, Tuggali Post, Tugalli, Kurnool District, A.P.

WHEREAS the above named Petitioners have made an application for Adding No.1 and 2 as Plaintiffs No. 8 and 9 in the above suit. As such you are hereby required to appear before this Hon'ble Court in person or by a pleader duly instructed on the 20th day of June 2023 at 10-30 O' clock to show cause of against the said Application, failing which the said Application will be heard and determined exparte.

Advocate for the Proposed Plaintiffs
(Alhaj A Mansoor Ahmed)

IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE AT ADONI
O.S.No. 130 OF 2020

BETWEEN:
Mr Jally Nagesh S/o. Late Jally Thimappa ...PLAINTIFF
AND
1. Mrs Chinna Anjinamma W/o. Jelly Pedda Narayana and 4 others. ...DEFENDANTS

To

SUMMON

Defendant No.3 Mr Gundaiah S/o. Jelly Narayana, aged about 35 years, Hindu, Cultivator, resident of B C Colony, Kuppagal Village, Adoni Mandal, Kurnool District, A.P

Defendant No.4 Mr Rogaiah S/o. Jelly Narayana, aged about 31 years, Hindu, Cultivator, resident of B C Colony, Kuppagal Village, Adoni Mandal, Kurnool District, A.P

Defendant No.5 Mr Boddappa S/o. Jelly Narayana, aged about 27 years, Hindu, Cultivator, resident of B C Colony, Kuppagal Village, Adoni Mandal, Kurnool District, A.P

Whereas the Plaintiff has instituted as suit against you for Grant of Injunction, You are hereby summoned to appear before this Hon'ble Court in person or by a pleader duly instructed and able to answer all material questions relating to the suit or who shall be accompanied by some person able to answer all such questions on the 21 ST day of June 2023 at 10-30 O' clock in the forenoon to answer the claim, and further you are hereby directed to file within 30 days of service of this summon a written statement of your defense and to produce on the said day all documents in your possession or power upon which you base your defense.

Advocate for the Plaintiff
(Alhaj A Mansoor Ahmed)

బాధితుల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్

భారీ ఈదురు గాలుల వర్షం

- ప్రధాన రహదారిపై కూలిన చెట్లు, విద్యుత్ స్తంభం
- వాహనాల రాకపోకలకు అంతరాయం

రహదారికి అడ్డంగా కూలి పడిన చెట్టు

ప్రజాశక్తి - పగిడ్యాల

పగిడ్యాలలో సోమవారం భారీ ఈదులుగాలులు వీచడంతో పాటు వర్షం కురిసింది. ఈదురు గాలులకు భారీ తుమ్మచెట్టు, విద్యుత్ స్తంభం కూలిపోయాయి. పగిడ్యాల నుంచి నందికొట్కూరుకు వెళ్లే ప్రధాన రహదారిలో పగిడ్యాల పెట్రోల్ బంకు, రాయపు గంగాధర్ రెడ్డి పొలం సమీపాన భారీ తుమ్మ చెట్టు కూలి రహదారికి అడ్డంగా పడిపోయింది. చెట్టు విద్యుత్ తీగలపై పడడంతో విద్యుత్ స్తంభం నేలకొరిగింది. దీంతో రహదారి వెంట వాహనాల రాకపోకలు స్తంభించిపోయాయి. తక్షణమే స్పందించిన పగిడ్యాల సర్పంచి పెరుమాళ్ళ శేషన్న జెసిబి సహాయంతో చెట్టును తొలగించి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడకుండా చర్యలు చేపట్టారు. విద్యుత్ శాఖ ఏఈ క్రాంతికుమార్ వెంటనే సిబ్బందితో అక్కడికి చేరుకుని మరమ్మతులు చర్యలు చేపట్టి విద్యుత్ అంతరాయం లేకుండా చేపట్టారు. అలాగే ఈదురుగాలులకు లక్ష్మాపురం గ్రామ సమీపాన విద్యుత్ స్తంభాలు కూలి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. లక్ష్మాపురం గ్రామం చీకటిమయంగా మారింది. విద్యుత్ శాఖ అధికారులు ముమ్మరంగా మరమ్మతు చర్యలు చేపట్టారు.

పిడుగు పడి వ్యక్తి మృతి

బనగానపల్లె : మండలం తమ్మడపల్లె గ్రామానికి చెందిన మడ్డి శీలయ్య (34) శివారు పొలాల్లో పిడుగు పడి అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాలు.. తమ్మడపల్లె గ్రామానికి చెందిన మడ్డి శీలయ్య ఆదివారం ఉదయం పొలం పనులకు వెళ్లాడు. సాయంత్రం కురిసిన వర్షాలకు, ఉరుములకు సమీపంలో పిడుగు పడడంతో మడ్డి శీలయ్య మృతి చెందాడు. పొలం పనులకు వెళ్లిన శీలయ్య రాత్రి అయినా ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పొలం వద్దకు వెళ్లాడు. పొలంలో విగత జీవిగా పడి ఉన్న శీలయ్యను బోరున విలపించారు. శీలయ్య మృతదేహాన్నిపోస్టుమార్టం నిమిత్తం పోలీసులు బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతునికి భార్య రాణి, ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామిరెడ్డి తెలిపారు.

ఎమ్మెల్యే కాటసాని నివాళి : పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో శీలయ్య మృతదేహానికి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ శీలయ్య కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామన్నారు. ఎమ్మెల్యే వెంట తమ్మడపల్లె సర్పంచి వెంకటరామిరెడ్డి, వైసిపి నాయకులు మధు యాదవ్ ఉన్నారు.

శీలయ్య మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

స్పందన అర్జీలపై నిర్లక్ష్యం తగదు : కలెక్టర్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

స్పందన అర్జీల పట్ల నిర్లక్ష్యం వహించడం తగదని, క్షేత్రస్థాయిలో పరిశీలించి నాణ్యతతో గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ మనజిర్ జిలాని సమూన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని వైయస్సార్ సెంటినరీ హాలులో స్పందన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కలెక్టర్‌తో పాటు డిఆర్ఓ పుల్లయ్య, జిల్లాధికారులు జిల్లా నలుమూలల నుండి వచ్చిన అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వైయస్సార్ కళ్యాణమస్తు షాది తోఫా కింద షేక్ షరీఫా ఎంపికై పెండింగ్‌లో ఉన్న అంశాన్ని కలెక్టర్ పరిశీలించి సమస్యను అక్కడికక్కడే పరిష్కరించారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమం కింద సంబంధిత గ్రీవెన్స్‌ను స్వీకరిస్తూ అర్జీదారులు సంతృప్తి చెందే స్థాయిలో పరిష్కరించాలన్నారు. హౌసింగ్ సంబంధించి అధికంగా దరఖాస్తులు వస్తున్న నేపథ్యంలో ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించాలని ఆదేశించారు.

రెడ్‌క్రాస్ సభ్యులకు

గుర్తింపు కార్డులు పంపిణీ

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

గుర్తింపు కార్డులు పంపిణీ చేస్తున్న జిల్లా కలెక్టర్

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీలో సభ్యులుగా చేరిన ప్రభుత్వ అధికారులకు, ప్యాట్రన్ సభ్యులకు గుర్తింపు కార్డులను రెడ్‌క్రాస్ సొసైటీ ప్రెసిడెంట్, జిల్లా కలెక్టర్ మనజీర్ జిలాని సామున్ సోమవారం పంపిణీ చేశారు. అలాగే రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో స్పందన ఆర్జిదారులకు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని సెబ్ ఎన్ఫోర్స్ డిపార్ట్మెంట్ అధికారి శ్రీధర్ రావు, అగ్నిమాపక శాఖ అధికారి జయన్న, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిపార్ట్మెంట్ అధికారి తిమ్మారెడ్డిలు ప్రారంభించారు. కాత్యాయని మెడికల్స్ అధినేత మారుతి కుమార్ కుమారుడు చేతన ఆదిత్య, ఆంధ్ర మెడికల్ అధినేత బైసాని రమేష్ ప్యాట్రన్ సభ్యులుగా ఐడి కార్డ్స్ పొందారు. జిల్లా అధికారులు ప్రతాపరెడ్డి స్కిల్ డెవలప్మెంట్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మనోహర్, రోడ్స్ అండ్ బిల్డింగ్స్ ఎస్ఈ శ్రీధర్ రెడ్డి, వ్యవసాయ జిల్లా అధికారి మోహన్ రావు, ఫైర్ డిపార్ట్మెంట్ అధికారి జయన్న, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాసులు, ఎక్సైజ్ శాఖ అధికారి రవి కుమార్ రెడ్డి, ఎండోమెంట్ అధికారి సుధాకర్ రెడ్డి, పంచాయతీ రాజ్, సెబ్ ఎన్ఫోర్మెంట్ ఎస్ఈ రామ్మోహన్ శ్రీధర్ రావు, మైన్స్ అధికారి రాజగోపాల్ తదితర అధికారులు కలెక్టర్ చేతుల మీదుగా రెడ్ క్రాస్ సభ్యత్వ కార్డులు అందుకున్నారు.

జర్నలిస్టులపై దాడి హేయమైన చర్య

- ఎపిడబ్ల్యుజెఎఫ్, వామపక్షాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన

ప్రజాశక్తి - బనగానపల్లె రూరల్

కర్నూల్ నగరంలో ఆంధ్రజ్యోతి, ఈనాడు, ఆర్‌టివి విలేకరులపై దాడి చేయడం హేయమైన చర్య అని ఎపిడబ్ల్యుజెఎఫ్, ప్రజా సంఘాల నాయకులు పేర్కొన్నారు. విలేకరులపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఎపిడబ్ల్యుజెఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట జర్నలిస్టులు, ప్రజాసంఘాల నాయకులు, వివిధ పార్టీల నాయకులు నిరసన వ్యక్తం చేశారు. తహశీల్దార్ శ్రీనివాసులు గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్టులు వెంకటేశ్వర్లు, రఘురాం రెడ్డి మాట్లాడుతూ ఆదివారం రాత్రి 11 గంటల సమయంలో కర్నూలులో ఆంధ్రజ్యోతి, ఈనాడు, ఆర్ టివి రిపోర్టర్లపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుపై దాడులను అరికట్టడానికి ప్రత్యేక చట్టం తీసుకురావాలని కోరారు. జర్నలిస్టులు వృత్తిపరంగా వార్తలు రాస్తారే తప్ప వ్యక్తిగతంగా ఎవరిపై కక్ష ఉండదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ నియోజకవర్గ ఉపాధ్యక్షులునర్సింహారెడ్డి, రామ చంద్రా రెడ్డి, కార్యదర్శి షాషావలి, మండల అధ్యక్షులు చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు రఘు రామిరెడ్డి, మధు, కార్యదర్శి రాజేష్, సీనియర్ జర్నలిస్టు వెంకట రాముడు, జర్నలిస్టులు రమణ, నగేష్, సుబ్బయ్య, శ్రీకాంత్, రమణ, ఓబులేసు, మనోహర్, భాష, భాష, సుధాకర్, పసుపల దస్తగిరి, వెంకట రాముడు, సిపిఎం, సిపిఐ మండల కార్యదర్శులు సుబ్బయ్య, సుబ్బారెడ్డి, గిరిజన సమైక్య జిల్లా అధ్యక్షులు కాలింగరి రాముడు, ఎఐటియుసి అధ్యక్షులు కుల్లాయి స్వామి, టిడిపి పట్టణ అధ్యక్షులు ఖాసిం బాబు, ముస్లిం మైనార్టీ నియోజకవర్గ అధ్యక్షులు రాయలసీమ సలాం, బిజెపి కార్యదర్శి యాదగిరి, జనసేన నాయకులు షేక్షావలి తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న జర్నలిస్టులు, ప్రజా సంఘాల నాయకులు

వాలంటీర్లు స్వచ్ఛంధ సేవకులు

నాల్గో పేజీ..

ఆళ్లగడ్డ నియోజకవర్గంలో 'యువగళం'

- లోకేష్‌కు అడుగడుగునా ఘన స్వాగతం

ప్రజాశక్తి - చాగలమర్రి/ఆళ్లగడ్డ

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర 107వ రోజు ఆళ్లగడ్డ అసెంబ్లీ నియోజకవర్గంలో ఉత్సాహంగా సాగింది. నియోజకవర్గంలోని దొర్నిపాడు క్యాంపు ఆవరణం నుండి టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర ప్రారంభం కాగా నియోజకవర్గ యువ నాయకులు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి ఆధ్వర్యంలో భూమా అభిమానులు, నాయకులు, కార్యకర్తలు భారీ గజమాలను క్రేన్ సహాయంతో వేసి ఘన స్వాగతం పలికారు. దారిపొడవునా యువనేతను చూసేందుకు జనం బారులు తీరారు. యువనేతను గజమాలలతో గ్రామాల్లోకి స్వాగతించారు. మహిళలు, రైతులు, వృద్ధులు యువనేతను కలిసి తమ సమస్యలు చెప్పుకున్నారు. మరో ఏడాదిలో రాబోయే చంద్రన్న ప్రభుత్వం అందరి సమస్యలు పరిష్కరిస్తుందని భరోసా ఇస్తూ లోకేష్ ముందుకు సాగారు. పాదయాత్రకు బయలుదేరే ముందు దొర్నిపాడులో బలిజ సామాజిక వర్గీయులతో సమావేశమైన లోకేష్ వారి సాధకబాధకాలు తెలుసుకున్నారు. అనంతరం ప్రారంభమైన పాదయాత్ర దొర్నిపాడు, రామచంద్రపురం, భాగ్యనగరం, చింతకుంట మీదుగా ఆళ్లగడ్డ శివారు విడిది కేంద్రానికి చేరుకుంది. పాదయాత్రలో దొర్నిపాడు మండలం సమీపంలో రైతులు నకిలీ విత్తనాలతో మోసపోయామని తమను ఆదుకోవాలని వినతి పత్రం అందజేశారు. అలాగే నాగలిని నారా లోకేష్‌కు బహుకరించారు. పాదయాత్ర దారిలో వివిధ గ్రామాల ప్రజలు, ఉపాధి హామీ కూలీలు, కెసి కెనాల్ రైతులు యువనేతను కలిసి తమ సమస్యలు విన్నవించారు. 107వ రోజు లోకేష్ 14.5 కిలోమీటర్లు పాదయాత్ర చేశారు. ఇప్పటివరకు యువగళం పాదయాత్ర 1378.1 కిలోమీటర్లు పూర్తయింది. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు ఎంఎస్ అన్సర్ భాష, మండల కన్వీనర్ లాయర్ నరసింహారెడ్డి, నంద్యాల జిల్లా మైనార్టీ సెల్ నాయకులు కొలిమి హుస్సేన్ వలి, కొలిమి మహబూబ్ షరీఫ్, కొలిమి మాభాష, ముల్లా గఫార్, ముల్లా అజీమ్, ఆకుల ఇర్షాద్, ఆలంసా గారి ఖలీల్, బషీర్, మహబూలాల్, నాగూర్ భాష, కొలిమి షబ్బీర్, సత్యనారాయణ, చాంద్ బాషా, లాయర్ నరసింహారెడ్డి, రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు. ఇదిలా వుండగా ఉమ్మడి కర్నూలు జిల్లాలో 40 రోజుల పాటు సాగిన యువగళం పాదయాత్ర మంగళవారం జమ్మలమడుగు నియోజకవర్గం సుద్దపల్లె వద్ద కడప జిల్లాలోకి ప్రవేశించనుంది.

మాట్లాడుతున్న నారా లోకేష్

యువగళం పాదయాత్రలో నారా లోకేష్

పల్లెటూరు నుంచి పరిశోధనల వరకు..

ఫిజిక్స్ విభాగంలో డాక్టరేట్ పొందిన సాహెబ్ ఖాన్

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

పి.సాహెబ్ ఖాన్

గ్రామీణ ప్రాంతాల యువకులు బాగా చదివి అత్యున్నత స్థాయికి చేరుకుంటున్నారు... ముఖ్యంగా పరిశోధనలు చేసి డాక్టరేట్లు అందుకుంటున్నారు. అందులో భాగంగా పాణ్యం మండలం గోనవరం గ్రామానికి చెందిన మహమ్మద్ ఖాసిం కుమారుడు పి.సాహెబ్ ఖాన్‌కు డాక్టరేట్ లభించింది. ఈయన ఆర్.జి.యం ఇంజనీరింగ్ కళాశాలలో ఫిజిక్స్ విభాగానికి చెందిన డాక్టర్ బి.సి జమాలయ్య పర్యవేక్షణలో పరిశోధనలు చేశారు. ఈయన ఆప్టికల్ అనాలసిస్ ఆఫ్ ప్రసోడైమియం, సమేరియం, యూరోపియం, దోపుడ్ స్ట్రోంటియం-గా డొలీనియం పాస్పెట్ నానో పాస్ఫర్స్ ఫర్ డిస్ప్లే అప్లికేషన్స్ అనే అంశంపై చేసిన పరిశోధనకు జేఎన్టీయూ అనంతపురం వారు డాక్టరేట్ ప్రకటించారు. ఈయన చేసిన పరిశోధన టెలివిజన్, ల్యాప్‌టాప్, సెల్ఫోన్, స్క్రీన్స్, లేజర్స్ వంటి పరికరాల అభివృద్ధికి దోహదపడుతుంది.. దీంతో పలువురు సాహెబ్ ఖాన్ ను అభినందించారు.

ఆళ్లగడ్డ వాసికి డాక్టరేట్

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

వరికుంట ఓబులేసు

ఆళ్లగడ్డ మండలం యాదవాడ గ్రామానికి చెందిన వరికుంట గుర్రన్న కుమారుడు వరికుంట ఓబులేసుకు జేఎన్టీయూ యూనివర్సిటీ అనంతపురం వారు స్కూల్ ఆఫ్ మేనేజ్మెంట్ స్టడీస్ విభాగంలో డాక్టరేటు ప్రదానం చేశారు. రాయలసీమ ప్రాంతంలో భారతీయ స్టేట్ బ్యాంకు శాఖలలో పని చేస్తున్న ఉద్యోగుల, ఉద్యోగ సంతృప్తి మూల్యాంకనానికి సంబంధించి చేసిన పరిశోధనకు డాక్టరేట్‌ను అందుకున్నారు. భారతీయ స్టేట్ బ్యాంకు ఉద్యోగులు ఆధునిక పద్ధతులతో పాటు అందుకు సంబంధించిన నైపుణ్యాలను మెరుగుపరచుకొని బ్యాంక్ అభివృద్ధికి ఎలా పాటుపడాలో ఈ పరిశోధనలో తెలియజేశారు. ప్రొఫెసర్ సుధీర్ కుమార్ పర్యవేక్షణలో ఈ పరిశోధన నిర్వహించినట్లు డాక్టరేట్ గ్రహీత వరికుంట ఓబులేసు తెలిపారు. వరికుంట ఓబులేసుకు డాక్టరేట్ రావడం పట్ల పలువురు అభినందనలు తెలియజేశారు.

నేటి నుండి విగ్రహ ప్రతిష్ట వేడుకలు

ప్రజాశక్తి - రుద్రవరం : మండలంలోని ఆర్.కొత్తూరు గ్రామంలో పట్టాభి రామస్వామి నూతన ఆలయ విగ్రహ ప్రతిష్ట వేడుకలు నేటి నుండి 25 వరకు ఘనంగా జరగనున్నాయి. సోమవారం గణపతి పూజ, పుణ్యాహ వాచనము కార్యక్రమాలు నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు, బండలాగుడు పోటీలు, రాతి గుండు

కళ్యాణ మండపం నిర్మాణానికి భూమి పూజ

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

కొలిమిగుండ్లలోని కస్తూర్బా పాఠశాల సమీపంలో రాంకో సిమెంట్ యాజమాన్యం సహకారంతో రూ. 2 కోట్లతో నూతనంగా నిర్మించనున్న కళ్యాణ మండపానికి బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి సోమవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండల ప్రజల సౌకర్యం కోసం కళ్యాణ మండపం నిర్మిస్తున్నట్లు చెప్పారు. రాంకో ఫ్యాక్టరీ యాజమాన్యం రూ. 2కోట్లతో నిర్మించేందుకు ముందుకు రావడం అభినందనీయమని కొనియాడారు. మండల ప్రజలు పెళ్లిళ్ల సమయంలో తాడిపత్రి, బనగానపల్లి, కోవెలకుంట్ల తదితర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుండేదన్నారు. ఇక్కడ ఏర్పాటు అయితే అందరికీ అందుబాటులో ఉంటుందన్నారు. కళ్యాణ మండపానికి అవసరమైన భూమికోసం జడ్పీ చైర్మన్‌తో కలిసి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో మంజూరు చేశారన్నారు. కళ్యాణ మండపం నిర్వహణ బాధ్యతలను కంపెనీ తీసుకుంటే మరింత బాగుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాంకో సీనియర్ వైస్ ప్రెసిడెంట్ రెడ్డి నాగరాజు, జనరల్ మేనేజర్ రవికుమార్, తహశీల్దార్ ధోని ఆల్ఫ్రెడ్, ఎంపిడిఒ సుబ్బరాజు, వైసిపి పబ్లిసిటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు పేరం సత్యనారాయణ రెడ్డి, మండల అధ్యక్షుడు అంబటి గురవి రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్

కార్పొరేట్ విద్యాసంస్థపై చర్యలు తీసుకోవాలి

- డిఇఒకు ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో వినతి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జిల్లాలో ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా నడుస్తున్న నారాయణ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం స్పందన కార్యక్రమంలో డిఇఒ అనురాధకు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నిరంజన్, కుమార్, నాయకులు ప్రతాప్, వినీత్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి లక్ష్మణ్‌లు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని నంద్యాల, డోన్, నందికొట్కూరులలో నారాయణ విద్యా సంస్థల బ్రాంచీలు నడుస్తున్నాయని, నిబంధనలను తుంగలో తొక్కి ప్రభుత్వ అనుమతి లేకుండానే ఈ సంవత్సరం ముందుగానే అక్రమ అడ్మిషన్లకు పాల్పడుతున్నారని చెప్పారు. పాఠశాలలో మౌలిక వసతులు, తరగతి గదులు, క్రీడా మైదానం, ఫైర్ సర్టిఫికెట్, అదనపు బ్రాంచీల పర్మిషన్లు లేకుండా నడుపుతున్నారని తెలిపారు. వెంటనే నారాయణ విద్యాసంస్థలను తనిఖీ చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

డిఇఒకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఎస్ఐ కుటుంబానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జిల్లాలో పోలీస్ శాఖలో పని చేస్తూ ఇటీవల అనారోగ్యంతో ఎస్ఐ మౌలిభాషతో పాటు ఇతర హోంగార్డులు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ కుటుంబాలకు జిల్లా ఎస్పీ ఆర్థిక సాయం అందజేశారు. వివరాలు.. నంద్యాల జిల్లాలో పని చేస్తూ అనారోగ్యంతో మరణించిన ఎస్ఐ మౌలిబాషా కుటుంబం ఆర్థికంగా ఇబ్బంది పడకుండా ప్రభుత్వం నుండి ఆర్థిక సహాయంగా విడో ఫండ్ నుండి రూ.50,000 చెక్కును సోమవారం నంద్యాల జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కె రఘువీర్ రెడ్డి ఎస్ఐ మౌలిబాషా భార్య జమీలాబీకి అందజేశారు. అలాగే ఇద్దరు హొంగార్డ్‌ల కుటుంబాలకు ప్రభుత్వం నుండి వెల్ఫేర్ గ్రాంట్ ద్వారా రూ.15,000 చొప్పున అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసు అడిషనల్ ఎస్పీ చంద్రబాబు, నంద్యాల టౌన్ డీఎస్పీ సి.మహేశ్వర్ రెడ్డి, జిల్లా పోలీసు కార్యాలయ అసిస్టెంట్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ నిజాముద్దీన్ ,హొంగార్డ్ ఇంచార్జ్ తిరుపం రెడ్డి పాల్గొన్నారు.

ఎస్ఐ మౌలిభాష భార్యకు చెక్కు అందజేస్తున్న జిల్లా ఎస్‌పి కె.రఘువీర్ రెడ్డి

మహానందిలో భక్తులపైకి దూసుకెళ్లిన కారు

- ముగ్గురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - మహానంది

మహానంది పుణ్యక్షేత్రంలో సోమవారం సాయంత్రం భక్తుల పైకి కారు అదుపుతప్పి దూసుకెళ్లడంతో ముగ్గురికి తీవ్ర గాయాలైన సంఘటన చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. అనంతపురం జిల్లాకు చెందిన కొందరు భక్తులు మహానంది క్షేత్రానికి స్వామి అమ్మ వార్ల దర్శనార్థమై కారులో వచ్చారు. వారు కారును సమాచార కేంద్రం వద్ద ఉంచగా అందులో కూర్చున్న మహిళ, పిల్లలు గేర్లు అటు ఇటు మార్చడంతో అదుపుతప్పి కారు బారికేడ్లను దాటి భక్తులపైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో బళ్లారికి చెందిన నాగలక్ష్మి, వరలక్ష్మి, నారాయణస్వామిలకు గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తమై నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గుడి ముందు భాగంలో ఉన్న ద్విచక్ర వాహనాలు కూడా రెండు స్వల్పంగా దెబ్బతిన్నాయి. సమాచారం తెలుసుకున్న మహానంది ఎస్ఐ నాగేంద్ర ప్రసాద్ సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు.

కలెక్టర్ సంతకం ఫోర్జరీపై కేసు నమోదు

ప్రజాశక్తి - మహానంది

మహానంది మండలం బొల్లవరం గ్రామానికి చెందిన వక్ఫ్ బోర్డు భూమి 486 సర్వే నెంబర్‌లో 2 ఎకరాల 66 సెంట్లు పైనే కలెక్టర్ సంతకం ఫోర్జరీ చేసి నిషేధిత జాబితా నుంచి తొలగించుకున్న వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగేంద్ర ప్రసాద్ సోమవారం తెలిపారు. ఎస్ఐ మాట్లాడుతూ బుక్కాపురం గ్రామానికి చెందిన సంగా చిన్నయ్య 2003లో 486/2 సర్వే నెంబరులో 2.66 సెంట్ల భూమిని ముల్లా ఖాదర్ వలి దగ్గర ఒక లక్ష 70 వేలకు కొనుగోలు చేశాడని, అప్పటినుండి వ్యవసాయం చేసుకుని జీవనం సాగిస్తున్నాడని తెలిపారు. అయితే అప్పుల కారణంగా ఈ భూమిని అమ్మి అప్పులు తీర్చాలనుకున్నాడని, భూమిని అమ్మడానికి వెళ్లగా వక్ఫ్ బోర్డ్ భూమిగా తేలడంతో ఉపేంద్ర అనే బ్రోకర్ దగ్గరికి వెళ్లి ఇది తన పేరున చేయాలని తెలపగా ఉపేంద్ర ఈ డాక్యుమెంట్ను విజయవాడ వెళ్లి సవరించుకొని రావాలని. ఇందుకు సుమారు లక్ష 50 వేల రూపాయలు ఖర్చు అవుతుందని తెలిపాడన్నారు. దాదాపుగా ఒకటిన్నర సంవత్సరం పూర్తి అవుతున్నా ఉపేంద్ర డాక్యుమెంట్ను తన పేరు మీదకి మార్చలేదని బాధితుడు తెలిపాడని చెప్పారు. నిందితున్ని త్వరలో పట్టుకుంటామని తెలిపారు.

నారా లోకేష్‌కు ఆత్మీయ వీడ్కోలు

ప్రజాశక్తి - బనగానపల్లె

బనగానపల్లె నియోజకవర్గంలో యువగళం పాదయాత్ర పూర్తి చేసుకొని ఆళ్లగడ్డలో అడుగు పెడుతున్న నారా లోకేష్‌కు మాజీ ఎమ్మెల్యే బిసి జనార్దన్ రెడ్డి, వారి కుటుంబ సభ్యులు ఆత్మీయ వీడ్కోలు పలికారు. సోమవారం కోవెలకుంట్ల మండలం కంపమల్ల మెట్ట విడిది కేంద్రం వద్ద మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్ రెడ్డి, ఆయన సతీమణి బిసి ఇందిరాల ఆధ్వర్యంలో కుటుంబ సభ్యులు ఆత్మీయ జ్ఞాపికను అందజేశారు. యువగళం పాదయాత్ర నియోజకవర్గంలో ఘన విజయం కావడంతో నారా లోకేష్ మాజీ ఎమ్మెల్యేకు, కుటుంబ సభ్యులకు, పార్టీ అభిమానులకు, కార్యకర్తలకు, మండల, గ్రామ నాయకులకు ధన్యవాదాలు తెలియజేశారు.

నారా లోకేష్‌కు జ్ఞాపిక అందజేసి తుది వీడ్కోలు పలుకుతున్న మాజీ ఎమ్మెల్యే బిసి జనార్దన్ రెడ్డి కుటుంబ సభ్యులు

నారా లోకేష్‌కు వినతి పత్రాన్ని అందిస్తున్న తెలుగుయువత అధ్యక్షులు కుమ్మరి సుధాకర్

జర్నలిస్టులపై దాడులు అప్రజాస్వామికం

ప్రజాశక్తి - నందికొట్కూరు

జర్నలిస్టులపై దాడులు చేయడం అప్రజాస్వామికమని ప్రతిపక్ష, వామపక్ష పార్టీలు, విద్యార్థి సంఘాల నాయకులు అన్నారు. ఎంపీ అవినాష్ రెడ్డి అనుచరులు హైదరాబాదు, కర్నూల్లోనూ ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియా పాత్రికేయులపై దాడి చేసి వారి కెమెరాలను ధ్వంసం చేసి, సెల్ ఫోన్లను లాక్కోవడం హేయమైన చర్య అని, దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని పాత్రికేయులు, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. దాడులకు నిరసనగా ఏపీ యూడబ్ల్యూజె (ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు) ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిరసన ర్యాలీ చేపట్టారు. నందికొట్కూరు పటేల్ సెంటర్లో నిరసన చేపట్టి, అనంతరం తహసీల్దార్ రాజశేఖర్ బాబుకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, సీపీఐ, సీపీఎం, ఏఐఎస్ఎఫ్, ఎస్.ఎస్.ఐ, పీడీఎస్‌యూ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఏపీయూడబ్ల్యూజే గౌరవాధ్యక్షులు రామాంజనేయులు మాట్లాడుతూ వార్తలను కవర్ చేసేందుకు వెళ్లిన విలేకరులపై కడప ఎంపీ అవినాష్‌రెడ్డి వర్గీయులు దాడి చేయడం హేయమైన చర్య అని ఆయన అన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రజలు ప్రభుత్వానికి వారధిగా ఉండేజర్నలిస్టులపై దాడులు చేయడం అధికారపార్టీ నాయకులకు తగదన్నారు. ఏపీ రైతు సంఘం నాయకుడు వెంకటేశ్వర్లు విలేకరులపై అర్ధరాత్రి దాడి చేసిన గుండాలపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులపై దాడి చేసిన వారిని వెంటనే శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ జయసూర్య, టీడీపీ రాష్ట్ర ముస్లీం మైనార్టీ అధికారప్రతినిధి షకీల్ అహ్మద్ మాట్లాడుతూ రాష్ట్రంలో విధ్వంసకరమైన పాలన కొనసాగుతోందన్నారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యకుడు శ్రీనివాసులు, పీడీఎస్‌యూ నాయకులు మర్రిస్వామి మాట్లాడుతూ జర్నలిస్తులపై అధికారపార్టీ గూండాలు చేస్తున్న దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు జయరాజ్, గోపి,వెంకటేష్, స్వామన్న, ఉమర్, తదితరులు పాల్గొన్నారు. **ఆత్మకూర్ :** పాత్రికేయులపై దాడిని నిరసిస్తూ స్థానిక ఆర్డిఓ కార్యాలయం ఎదుట మీడియా ప్రతినిధులు, ప్రజా సంఘా నాయకులు కర్నూలు- గుంటూరు రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ పాత్రికేయులు జోసఫ్ చంద్రశేఖర్, వెంకటకృష్ణ, శీలం శేషు, సైపుద్దీన్, తదితరులు మాట్లాడారు. అనంతరం ఆర్డిఓ దాసుకు వినతి పత్రాన్ని అందించారు. పాత్రికేయులు సుధాకర్, చంద్ర, సురేష్, అన్వర్, రవి కుమార్, తదితరు పాల్గొన్నారు. **పాములపాడు:** జర్నలిస్టులపై దాడికి పాల్పడిన వారిపై వెంటనే కేసులు నమోదు చేయాలని బీఎస్పీ నందికొట్కూరు ఇన్చార్జి స్వాములు, సిపిఐ నాయకులు రమేష్ బాబు, టిడిపి నాయకులు గోవిందు, మండల తెలుగు యువత అధ్యక్షులు మధు కృష్ణ, మాల మహానాడు నాయకులు అంకన్న, నాగరాజు, పత్రికా విలేకరులు మల్లికార్జున శెట్టి, కాజా మొహిద్దిన్, షఫీలు అన్నారు. జర్నలిస్టలపై దాడిని నిరసిస్తూ పాములపాడులో రాస్తారోకో నిర్వహించి, తహశీల్దార్ రత్న రాధికకు వినతి పత్రాన్ని అందజేశారు. **బేతంచెర్ల :** విలేకరులపై ఎంపీ అవినాష్ రెడ్డి అనుచరులు దాడి చేయడం అమానుషమని మండలంలోని సిపిఎం, సిపిఐ ప్రజాసంఘాలు, టిడిపి, కుల సంఘాల నాయకులు పేర్కొన్నారు. బేతంచెర్ల పత్రిక విలేకరుల సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. అనంతరం బేతంచెర్ల మండలం సర్కిల్ ఇన్స్పెక్టర్ ప్రియతమ్ రెడ్డి, ఎస్సై శివ శంకర్ నాయక్‌లకు విలేకరులపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్ర మంలో విలేకర్లు వెంకట రాముడు,వేంకటేశ్వర గౌడ్,లక్ష్మయ్య,బండ రాముడు, వేణు గోపాల్,వి. సుబ్బారాయుడు,మద్దిలేటి స్వామి, తదితరులు పాల్గొన్నారు. **ఆళ్లగడ్డ:** విలేకరులపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఎపి రైతు సంఘం నంద్యాల జిల్లా సహాయ కార్యదర్శి రామచంద్రుడు డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నందికొట్కూరు : వినతి పత్రం ఇస్తున్న నాయకులు

ఆర్డీవో దాసుకు వినతిపత్రం అందిస్తున్న మీడియా ప్రతినిధులు

మొక్కజొన్న క్వింటా రూ.1,962

- ప్రభుత్వ మద్దతు ధరకే రైతులు అమ్ముకోండి : జెసి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జిల్లాలో మొక్కజొన్న రైతులు ప్రభుత్వం నిర్ణయించిన ధరకు అమ్ముకోవాలని, మోసపోవద్దని జిల్లా జాయింట్ కలెక్టర్ టి. నిశాంతి సోమవారం ఓ ప్రకటనలో రైతులకు సూచించారు. రబీలో జిల్లాలో మొక్కజొన్నలు 28 మండలాల్లో 47761.66 ఎకరాలలో రైతులు ఈ - క్రాప్ బుకింగ్ చేసుకున్నారని, పభుత్వ మద్దతు ధర క్వింటాల్ రూ.1,962 మొక్కజొన్నలు కొనుగోలు కొరకు మొత్తం 1279 రైతులు నమోదు చేసుకున్నారు. ప్రభుత్వము ఇచ్చిన కోటా 1545.00మెట్రిక్ టన్నులు ప్రభుత్వము ఇచ్చిన కోటా ప్రకారము 1442.85 మెట్రిక్ టన్నులు మొక్కజొన్నలు కొనుగోలు చేశామని పేర్కొన్నారు. నంద్యాల జిల్లాకు మొక్కజొన్నలు కొనుగోలుకు అధనంగా 5000 మెట్రిక్ టన్నులు కేటాయించడము జరిగినదని జెసి పేర్కొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లు తిరిగి విధుల్లోకి

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

మండలంలోని పార్నపల్లి గ్రామ 'ఉపాధి హామీ' ఫీల్డ్ అసిస్టెంట్‌గా శివ మల్లికా దేవిని విధుల్లోకి తీసుకోవాలని ఎపి హైకోర్టు ఆదేశించింది. రాజకీయ కారణాలవల్ల విధులు నుండి తప్పించారని శివ మల్లికా దేవి హైకోర్టును ఆశ్రయించడంతో ఆమెను విధుల్లోకి తీసుకోవాలని న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. మండల అభివద్ధి అధికారి ఆమెను తిరిగి విధుల్లోకి తీసుకున్నట్లు ధ్రువీకరణ పత్రం ఆమెకు అందించారు. మండలంలోని ఫీల్డ్ అసిస్టెంట్లు హర్షం వ్యక్తం చేశారు.

శాలివాహనుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

తెలుగు యువత అధ్యక్షులు కుమ్మరి సుధాకర్

ప్రజాశక్తి-డోన్

శాలివాహనుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని డోన్ నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షులు, నంద్యాల జిల్లా శాలివాహనుల జిల్లా అధ్యక్షులు కుమ్మరి సుధాకర్ టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్‌ను కోరారు. సోమవారం యువగళం పాదయాత్ర సందర్భంగా శాలివాహనులు నారా లోకేష్‌కు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా డోన్ నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షులు నంద్యాల జిల్లా శాలివాహనుల జిల్లా అధ్యక్షులు కుమ్మరి సుధాకర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని శాలివాహనులకు కమ్యూనిటీ భవనాలు, శాలివాహన చక్రవర్తి కవయిత్రి మొల్ల విగ్రహ ఏర్పాటుకు కృషి చేయాలని, కవయిత్రి మొల్ల జయంతి వేడుకలు ప్రభుత్వపరంగా నిర్వహించే విధంగా కృషి చేయాలని అన్నారు. కుమ్మర కుంటలను కాపాడి, శాలివాహనులు తమ వృత్తిపరమైన కుండలు అమ్ముకోవడానికి ప్రభుత్వం రాయితీ అందించాలని లోకేష్‌కు వివరించారు. అందుకు ఆయన సానుకులంగా స్పందించారని తెలిపారు. అనంతరం శాలివాహనులు నారా లోకేష్‌కు మర్యాదపూర్వ కంగా పూలమాలలు వేసి కలిశారు. ఈ కార్యక్రమంలో శాలివాహనులు జ్యోతిశ్వరుడు, భీమన్న,శివశంకర్,మారెళ్ళ జయచంద్ర,పుల్లయ్య, రాముడు, దస్తగిరి, సురేంద్ర,సుబ్బయ్య,శేఖర్, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

గోడ పత్రికలను విడుదల చేస్తున్న దృశ్యం

జల జాగరణ దీక్షను విజయవంతం చేయండి

ప్రజాశక్తి - కొత్తపల్లి

ఈనెల 31న జరుగనున్న సిద్దేశ్వర జల జాగరణ దీక్షను విజయవంతం చేయాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జ దశరథ రామిరెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని నందికుంట, శివపురం, పెద్ద గుమ్మడాపురం, ఎర్రమఠం,లింగాపురం గ్రామాలలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మండలంలోని ఆయా గ్రామాల ప్రజలతో వారు మాట్లాడారు. రాయలసీమలో ఉద్యమ స్ఫూర్తిని నింపిన సిద్దేశ్వరం అలుగు ప్రజా శంకుస్థాపన ఏడవ వార్షికోత్సవం పురస్క రించుకుని సిద్దేశ్వరం జల జాగారణ దీక్ష కార్యక్రమాన్ని చేపట్టాలని నిర్ణయించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ సాగునీటి సాధన సమితి కర్నూలు జిల్లా కన్వీనర్ చంద్రశేఖర్ రెడ్డి, కొక్కెరంచ విష్ణువర్ధన్ రెడ్డి, నందికుంట నారాయణ రెడ్డి, సింగిల్ విండో మాజీ ప్రెసిడెంట్ వెంకటరమణమ్మ, తులశీశ్వరరెడ్డి, ఎదురుపాడు అయ్యపురెడ్డి, శివపురం సర్పంచ్ చంద్రశేఖర్, మాభాష, శివన్న గౌడ్, ఎర్రమఠం సింగిల్ విండో చైర్మన్ జనార్థన్ రెడ్డి, మహేశ్వరరెడ్డి, సుధాకర్ రావు పాల్గొన్నారు.

యువత స్వయం ఉపాధితో ఎదగాలి

- ఎంపిపి వీరభద్రుడు

ప్రజాశక్తి - చాగలమర్రి

ఉన్నత చదువులు చదివి ప్రభుత్వం ఉద్యోగం వచ్చేంతవరకు ఎదురు చూడకుండా యువకులు స్వయం ఉపాధితో ఎదగాలని మండల అధ్యక్షులు వీరభద్రుడు, డి వనిపెంట సర్పంచ్ రేనాటి బాల ఈశ్వర రెడ్డిలు కోరారు. సోమవారం మండల పరిధిలోని శెట్టివీడు బస్టాండ్ ప్రాంతంలో పసుపుల బాల వీరయ్య అనే యువకుడు ఏర్పాటు చేసిన సాయి హోటల్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ వీరభద్రుడు మాట్లాడుతూ ఉన్నత చదువులు చదివిన యువకులు ప్రభుత్వ ఉద్యోగం కోసం ఎదురు చూడకుండా నైపుణ్యతను బట్టి వృత్తిని ఎంచుకొని స్వయం ఉపాధి అడుగు ముందుకు వేయాలన్నారు. రుచికరంగా నాణ్యమైన భోజనంను గిట్టుబాటు ధరకు ప్రజలకు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో పసల వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

హెూటల్ ను ప్రారంభిస్తున్న ఎంపీపీ వీరభద్రుడు

పర్యావరణాన్ని పరిరక్షించాలి

పర్యావరణంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ప్రతి ఒక్కరు కనీసం ఒక మొక్కను పెంచి పర్యావరణాన్ని పరిరక్షించాలని నూతల సెక్షన్ ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ శ్రీనివాస్ రెడ్డి, ఫారెస్ట్ బీట్ అధికారులు రామకృష్ణ, నాగేంద్రయ్య తెలిపారు. పర్యావరణ హిత జీవనశైలి మాసోత్సవంలో భాగంగా జిల్లా అటవీశాఖ అధికారి వినీత్ కుమార్ ఆదేశాల మేరకు, రుద్రవరం అటవీ క్షేత్ర అధికారి శ్రీపతి నాయుడు ఉత్తర్వుల మేరకు మండలంలోని జి.జంబులదిన్నె, బాచాపురం గ్రామాలలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వాడాలని, సుస్థిరమైన ఆహార పద్ధతులను అలవర్చుకోవాలన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని, ఎలక్ట్రానిక్ వ్యర్థాలను తగ్గించాలన్నారు. కార్యక్రమంలో ప్రొటెక్షన్ వాచర్ సుధాకర్, పంచాయతీ కార్యదర్శి శివ రాంబాబు, సచివాలయ సిబ్బంది రామ శేషయ్య, మహిళా పోలీస్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

28న ఉచిత ఖత్నా శిబిరం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల దూదేకుల సంఘం ఆధ్వర్యంలో ఈనెల 28వ తేదీ ఆదివారం ఉదయం ఏడు గంటల నుండి డాక్టర్ బాబన్ నూర్ నర్సింగ్ హోమ్ ఆవరణంలో ఉచిత ఒడుగుల శస్త్ర చికిత్స శిబిరం ఏర్పాటు చేయడం జరిగిందని నంద్యాల పట్టణ దుదెకుల సంఘం రాష్ట్ర నాయకులు డాక్టర్ బాబన్, అధ్యక్ష, కార్యదర్శులు వాసవి దస్తగిరి, ఆదాం సాహెబ్ లు తెలిపారు. సోమవారం దూదేకుల సంఘం ఆధ్వర్యం లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. అధునాతన శాస్త్రీయ పద్ధతులలో ఉచితంగా వడుగులు చేయడమే కాకుండా, ఒడుగులు చేయించుకున్న వారికి ఎర్రని వస్త్రము, మందులు ఉచితంగా ఇవ్వడం జరుగుతుంద న్నారు. చిన్నారుల పేర్లు త్వరగా నూర్ నర్సింగ్ హోమ్ నందు నమోదు చేయిం చాలని అన్నారు. ఈ సమావేశంలో పట్టణ సంఘ ఆర్గనైజింగ్ సెక్రెటరి హుసేనప్ప, కోశాధికారి సోమశేఖర్, బాదుల్లా, గబ్బర్ దస్తగిరి, చిన్న రసూల్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నంద్యాల పట్టణ దుదెకుల సంఘం రాష్ట్ర నాయకులు డాక్టర్ బాబన్

డ్రెయినేజీ నిర్మాణానికి భూమి పూజ

ప్రజాశక్తి - బనగానపల్లె

మండలంలోని పలుకూరు గ్రామంలో డ్రెయినేజీ నిర్మాణానికి వైసిపి రాష్ట్ర కార్యదర్శి గుండం శేషిరెడ్డి సోమవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని కొత్తపేట కాలనీ నుంచి ఎస్సీ కాలనీ నుంచి వర్షపు నీరు వడ్డేపేటలో ప్రవహించేదని, డ్రెయినేజీ కాలువ లేనందున వడ్డే పేట ప్రజలు తీవ్ర ఇబ్బంది పడేవారన్నారు. ఎన్నో సంవత్సరాలుగా ఉన్న డ్రైనేజీ సమస్య పరిష్కారం కానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైసిపి యువజన విభాగం నంద్యాల జిల్లా అధ్యక్షుడు గుండం నాగేశ్వర రెడ్డి, ఉప సర్పంచ్ కే శివకృష్ణ, వార్డ్ మెంబర్ అబ్దుల్లాపురం వెంకటరమణ, సచివాలయ కన్వీనర్ వెంకట సుబ్బారెడ్డి, వడ్డే వెంకటేష్, సురేష్ గౌడ్, వైసిపి సీనియర్ నాయకుడు వల్లెపు రాముడు, మంజుల బాలుడు, మంజుల తిమ్మయ్య, దండగల హనుమంతు, గోగుల వెంకటేశ్వర్లు, గోగుల లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

కాలువ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న వైసీపీ రాష్ట్ర కార్యదర్శి గుండం శశి రెడ్డి

మదరసా నిర్మాణానికి భూమి పూజ

ప్రజాశక్తి-డోన్

పట్టణంలోని బేతంచెర్ల రోడ్డు నందు ముస్లింల బాలికల మదర్సా నిర్మాణానికి మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ సోమవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ హాస్టల్ ఎదురుగా ఉన్న మూడు సెంట్ల స్థలమును మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఆదేశానుసారం ముస్లిం బాలికల మదర్సా నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. బాలికలు చక్కగా చదువుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని అన్నారు. ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి,వైస్ చైర్మన్‌లు కొట్రికె హరికిషన్, ఎస్ఎండి జాకీర్ హుస్సేన్,కౌన్సిలర్లు మౌలాబి, ఫాతిమా, నాగేంద్ర, ఆర్ట్ రమణ,నంద్యాల జిల్లా బీసీ అధ్యక్షులు పోస్ట్ ప్రసాద్, నియోజవర్గ సోషల్ మీడియా కోఆర్డినేటర్ టిఇ.దినేష్ గౌడ్,పట్టణ యూత్ అధ్యక్షులు ఆర్ ఇ.రాజవర్దన్ గౌడ్,సచివాలయాల కన్వీనర్ కురుకుంద హరి,వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎం.నాగభూషణం రెడ్డి,ఫారెస్ట్ మౌలాలి,సుభాన్, జనార్దన్,కృష్ణారెడ్డి,సతీష్, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

భూమి పూజ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్

చెక్కును అందజేస్తున్న దృశ్యం

వైఎస్ఆర్ బీమా తక్షణ సాయం అందజేత

ప్రజాశక్తి - కోవెలకుంట్ల

బాధిత కుటుంబానికి వైయస్సార్ బీమా పథకం ద్వారా తక్షణం సాయం కింద రూ.10 వేలను ఉప సర్పంచ్ జిసిఆర్ సూర్యనారాయణ రెడ్డి, ఈవో బాల ఆంజనేయులు అందజేశారు. పట్టణంలోని జమ్మలమడుగు రోడ్‌లోని నివాసం ఉంటున్న సయ్యద్ బాష అనారోగ్యంతో మరణించాడు. బాధిత కుటుంబానికి తక్షణ బీమా సాయంను సోమవారం ఆయన కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్, వాలంటరీ పాల్గొన్నారు.

మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా బాలస్వామి బాధ్యతలు

ప్రజాశక్తి - ఆత్మకూరు

ఆత్మకూరు మండల పరిధిలోని వడ్ల రామాపురం గ్రామానికి చెందిన వైసీపీ సీనియర్ నాయకులు బాలస్వామి సోమవారం పట్టణంలోని మార్కెట్ యార్డ్ ఛాంబర్‌లో మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా అధికారికంగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సమస్యలపై నిరంతరం పనిచేసే విధంగా, మార్కెట్ యార్డ్ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఈ అవకాశం కల్పించిన ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి ప్రత్యేక అభినందనలు తెలిపారు. శిల్పా భువనేశ్వర్ రెడ్డికి, శిల్పా కార్తిక్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

బాధ్యతలు స్వీకరిస్తున్న దృశ్యం

వాలంటీర్లు స్వచ్ఛంధ సేవకులు

- ఎమ్మెల్యే, జెడ్పి చైర్మన్

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

వాలంటీర్లు స్వచ్ఛంద సేవకులని బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పి చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డిలు కొనియాడారు. సోమవారం కొలిమిగుండ్లలోని సాయిబాబా కళ్యాణ మండపంలో వాలంటీర్లకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, వైసిపి మండల అధ్యక్షుడు అంబటి గురివి రెడ్డి, జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు లాయర్ మహేష్ రెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా విధి నిర్వణంలో ప్రతిభ చూపిన వాలంటీర్లను సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్‌లు మాట్లాడుతూ సొంత గ్రామంలో సేవ చేసే అవకాశాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కల్పించారని అన్నారు. వాలంటీర్లకు మరింత ప్రోత్సాహం అందించాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం ప్రతి ఏటా అవార్డులు అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు,ఉపాధ్యక్షులు కృష్ణారెడ్డి, జెఎసి అధ్యక్షుడు మొలక రాజారెడ్డి, హనుమంతు గుండం రామిరెడ్డి, తహాసిల్దార్ ధోని ఆల్ఫ్రెడ్, ఎంపీడీవో సుబ్బరాజు, ఈఓఆర్డి తాహిర్ హుస్సేన్, సర్పంచులు, ఎంపిటీసీలు, నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. **పగిడ్యాల:** వాలంటీర్ల సేవలు మరువలేనివని జడ్పిటిసి పుల్యాల దివ్య, మాజీ జడ్పిటిసి పుల్యాల నాగిరెడ్డి, సర్పంచు పెరుమాళ్ళ శేషన్న అన్నారు. సోమవారం స్థానిక వెలుగు కార్యాలయంలో సచివాలయం 1,2 పరిధిలోని వాలంటీర్లను సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రజల వద్దకే పథకాలను చేరవేయడంలో వాలంటీర్ల సేవలు అద్భుతం అన్నారు. అనంతరం ఎంపీడీవో వెంకటరమణ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఈఓఆర్‌డి పుల్లయ్య, కార్యదర్శి ఉపేంద్రారెడ్డి సచివాలయ సిబ్బంది వాలంటీర్లు పాల్గొన్నారు.

వాలంటీర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే, జెడ్పి చైర్మన్

వాలంటీర్లను సన్మానిస్తున్న జడ్పిటిసి, నేతలు

ఒపిఎస్‌ను పునరుద్ధరించాలి

దీక్షలో పాల్గొన్న ఉద్యోగులు

ప్రజాశక్తి - ఆత్మకూరు

సిపిఎస్ రద్దు చేయాలని ఓపీఎస్‌ను పునరుద్ధించాలని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం డిమాండ్ చేసింది. సోమవారం నాడు స్థానిక తాసిల్దార్ కార్యాలయం ఎదుట నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షులు నరసింహులు కార్యదర్శి నాగేంద్రప్ప, ఉపాధ్యక్షులు గిరి శంకర్ రెడ్డి, శ్రీనివాసులు, ఆత్మకూర్ యూనియన్ నాయకులు బాలకృష్ణ య్య, చాంద్ బాషా, కేపీ మస్తానయ్య, రమణ, తదితరులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఔట్సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేసి, డిఏ బకాయిలు చెల్లించాలని, పిఆర్సి కమిటీని ఏర్పాటు చేయాలని కోరారు.

ATMAKUR MUNICIPALITY - NANDYAL DIST

Tender Notice No:47-CCTV/GF/Engg/Atkr/2022, 53-GGMp to 63-GGMp/3rd Call/SPG Palem1/Engg/ Atkr/2022, and 82-15thFC & 87-15th FC 2020-21/2nd Tied/Engg/Atkr/2023/2nd Call, 01 to 04 - CMDF - RO Plants/Engg/Atkr/2023

Name Of Scheme	1.Gadapa Gadapaku Mana Prabhutwam 2. General Fund 3.15th FC 2020-21 Grant 4. CMDF FUND
No.of Works	18 Nos of Works
Total Value of Works	Rs.57,67,620.00
Tender Schedule Starting Date	23/05/2023, at 11.00 AM
Deeposits Payment Last Date	07/06/2023, at 03.00 PM
Opening Tender Date	07/06/2023, at 05.00 PM
Name and address of the CConcerned Commissioner	Commissioner, Atmakur Municipality Ph.08517-224105, Cell : 9908045558

Further Details can be Seen @ apeprocurement market place at www.tender.apeprocurement.ap.gov.in

Commissioner,
Atmakur Municipality

మహారాజశ్రీ ఆళ్లగడ్డ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O. S.No.205/2022

ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్, చాగలమర్రి
R/its బ్రాంచ్ మేనేజర్.
...వాది

V/S

1) జి.భాస్కర్ రావు
2) జి. పుష్పరాజు.
...ప్రతివాదులు

2 వ ప్రతివాది అడ్రసు

గాలిపోతు పుష్పరాజు,
S/o. రాజారత్నం,
R/o. 2-46, S. C.కాలని,
చాగలమర్రి - గ్రామం & మండలం,
నంద్యాల -జిల్లా.

పై నెంబరు దావాలో వాది బాకీ రాగోరి ప్రతివాదులపై దావా దాఖలు చెయ్యగా కోర్టు వారు 2 వ ప్రతివాది అయిన నీకు ఎన్నిసార్లు సమన్లు పంపిననూ నీ నుండి ఎటువంటి జవాబు లేనందున పై కోర్టు వారు పేపరు ప్రకటన ద్వారా మీ హాజరుకై 14-06-2023 వ తేదీన ఉదయం 10:30 గంటలకు నీవు గాని, నీ తరపున న్యాయవాది గాని హాజరై మీ ఆక్షేపణలు తెలియపరచుకోగలరు. లేని యెడల నీ పరోక్షములో పై దావాను తీర్మానము జరుగునని ఇందుమూలముగా నీకు తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా : 14-06-2023

పి.యస్.మహబూబ్ బాష
వాది తరపున అడ్వకేట్
చాగలమర్రి - పోస్ట్
నంద్యాల - జిల్లా

మహారాజ శ్రీ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు : డోన్

IP No. 11/2023

వడ్డే హరిత భర్త హనుమన్న
R/o ఇంటి నెం.7/238, టి.ఆర్.నగర్,
డోన్ పట్టణం మరియు నంద్యాల జిల్లా. ...అర్జీదారు

V/s

యస్. హరీపా భర్త రాజుగౌడ్
మరియు ఇతరులు
...ప్రతివాదులు

జనరల్ నోటీసు

పై అర్జీదారురాలు తనను దివాళాదారుగా ప్రకటించమని పై కోర్టు నందు దివాళా అర్జీ నెంబర్ 11/2023 గా దాఖలు చేసియున్నాడు కావున ఇందు మూలంగా యావన్మందికి తెలియజేయడం ఏమనగా మీకు ఏమైనా అభ్యంతరములు ఉన్న ఎడల 26-06-2023న పై కోర్టు ముందు ఉదయం 10:30 గంటలకు మీరు కానీ మీ వకీలు ద్వారా హాజరయ్యి మీ ఆక్షేపణలు తెలుపుకొగలరు. లేని పక్షంలో మీ పరోక్షమున తీర్మానం చేయబడును.

(కోర్టు వారి ఉత్తర్వులమేరకు)

వాయిదా తేదీ : 26-06-2023

బి.భాస్కర్,
అర్జీదారు పరం అడ్వకేటు,
డోన్, నంద్యాల జిల్లా.
సెల్ : 9440208679

మహారాజశ్రీ ఆళ్లగడ్డ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

I.A. No.550/2023 O. S. No.147/2023

ముల్లా జైలాన్,
S/o. లేట్ చిన్న దాదాసాహెబ్,
వయస్సు 55 సం॥, ముస్లిం,
చాగలమర్రి గ్రామం మరియు మండలం,
నంద్యాల జిల్లా. ...పిటిషనర్/వాది

V/S

1) శ్రీ పాద సత్యనారాయణ,
S/o. సత్యనారాయణ,
వయస్సు 70 సం॥,లు
C/o. నవోదయ ట్రేడింగ్ కంపెనీ పెట్రోల్ బంక్,
నియర్ APSEB. NH.18, చాగలమర్రి గ్రామం
మరియు మండలం. నంద్యాల జిల్లా.
...రెస్పాండెంట్/ప్రతివాది

1వ రెస్పాండెంట్ కు ఆర్డర్ 39 రూల్ 1 మరియు 2నోటీసులు

పిటిషనర్ / వాది టెంపరరీ ఇంజక్షన్ కోరి రెస్పాండెంట్ అయిన నీపై పిటిషన్ దాఖలు చేసి ఉన్నందున సదరు పిటిషన్ లో నీ యొక్క హాజరు నిమిత్తం 13-07-2023 వ తేదీన ఉదయం 10:30 గంటలకు నీవు స్వయంగా కానీ మీ వకీలు ద్వారా కానీ హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలెను లేనియెడల నీకు పరోక్షంగా పిటిషన్ తీర్మానించేదరు.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా : 13-07-2023

సి.మద్దిలేటి,
కె.వెంకటేశ్వర్లు,
పిటిషనర్ తరపున న్యాయవాదులు,
నంద్యాల, ఆళ్లగడ్డ.

మహారాజశ్రీ ఆళ్లగడ్డ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

I. A. No.551/2023 O. S. No.147/2023

ముల్లా జైలాన్,
S/o. లేట్ చిన్న దాదాసాహెబ్,
వయస్సు 55 సం॥, ముస్లిం.
చాగలమర్రి గ్రామం మరియు మండలం,
నంద్యాల జిల్లా. ...పిటిషనర్/వాది

V/S

1) శ్రీ పాద సత్యనారాయణ,
S/o.సత్యనారాయణ,
వయస్సు 70 సం॥, లు
C/o. నవోదయ ట్రేడింగ్ కంపెనీ పెట్రోల్ బంక్,
నియర్ APSEB. NH.18,
చాగలమర్రి గ్రామం మరియు మండలం.
నంద్యాల జిల్లా. ...రెస్పాండెంట్/ప్రతివాది

1 వ రెస్పాండెంట్ కు ఆర్డర్ 26 రూల్ 9 నోటీసులు

పిటిషనర్/వాది రెస్పాండెంట్ అయిన నీపై దావాలో భూమిని కొలతలకు గాను అడ్వకేట్ కమిషనర్ అపాయింట్‌మెంట్ కొరకు పిటిషన్ ను దాఖలు చేసి ఉన్నందున సదరు పిటిషన్ లో నీ యొక్క హాజరు నిమిత్తం 13-07-2023 వ తేదీన ఉదయం 10:30 గంటలకు పై కోర్టులో నీవు స్వయంగా కానీ, మీ వకీలు ద్వారా కానీ హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలెను లేని యెడల నీకు పరోక్షంగా పిటిషన్ తీర్మానించేదరు.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా : 13-07-2023

సి.మద్దిలేటి,
కె.వెంకటేశ్వర్లు,
పిటిషనర్ పరం న్యాయవాదులు,
నంద్యాల, ఆళ్లగడ్డ.

మహారాజ శ్రీ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు :: ఆళ్లగడ్డ

E.P.NO. 59/2020. In O.P.NO. 520/2002

M.రామచంద్రారెడ్డి, వయసు 62 సం॥
తండ్రి లక్ష్మీరెడ్డి రెడ్డిపల్లె గ్రామము,
సంజామల మండలం, కర్నూలు జిల్లా,
ప్రస్తుతం నంద్యాల జిల్లా. ...డిక్రి హెూల్డరు

V/S

స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (L.A.O) S.R.B.C,
బనగానపల్లె ప్రస్తుతం నంద్యాల. ...తీర్పు రుణగ్రస్తుడు

వేలం ప్రకటన

ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయడం ఏమనగా డిక్రి హెూల్డరుకు, తీర్పు రుణగ్రస్తుడి నుండి డిక్రి ప్రకారం తనకు రావలసిన భూమి నష్టపరిహారం మొత్తంను రాబట్టుకొనుటకు పైకోర్టులో షెడ్యూల్ దాఖలా స్థిరాస్తిని వేలంనకు తెచ్చి ఉన్నాడు. పైకోర్టు వారి ఎదుట 25-07-2023 న ఉదయం 10-30 గంటల నుండి పబ్లిక్ వేలం జరపబడును. పై వేలంలో పాల్గొనుటకు ఇష్టమున్నవారు సదరు వేలంలో పాల్గొనవచ్చును. కోర్టువారి షరతులకు లోబడి వేలం వేయబడును.

షెడ్యూల్ :: గతంలో కర్నూలు జిల్లా, ప్రస్తుతం నంద్యాల జిల్లా, ఆళ్లగడ్డ మండలం, ఆళ్లగడ్డ సబ్ రిజిస్ట్రార్ పరిధిలోని ఆళ్లగడ్డ గ్రామంలోగల గవర్నమెంటువారి బయలు స్థలమునకు చెక్కుబంది :
సర్వే నంబరు 208/2,
కొలతలు :- తూర్పు - పడమర: 100 అడుగులు
ఉత్తరం - దక్షిణం : 75 అడుగులు,(7500 చదరపు అడుగులు)
చెక్కుబంది :-
తూర్పు: గంగమ్మ గుడికి పొవు సిమెంటు రోడ్డు.
పడమర: ఇదే సర్వే నంబర్లో మిగిలివున్న తహసీల్దార్ ఆఫీసుకు తూర్పు - ఉత్తర దిశలలోనున్న గవర్నమెంటు వారి బయలు స్థలము.
ఉత్తరం: గంగమ్మగుడికి పొవు సిమెంటు రోడ్డు నుండి బొరుగుల బట్టీలకు పొవు సిమెంటు రోడ్డు.
దక్షిణం: ఇదే సర్వే నంబర్లో మిగిలివున్న తహసీల్దార్ ఆఫీసుకు ఎదురుగా ఉన్న గవర్నమెంటువారి బయలు స్థలము.
D.Hr. మదింపు విలువ: రూ.10,00,000/-
అమీనా విలువ: రూ.16,00,000/-

(కోర్టువారు ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేదీ : 25-07-2023.

K.బాల వెంకటరెడ్డి,
డిక్రీ హెూల్డరు పరం న్యాయవాది,
నంద్యాల జిల్లా.
సెల్ : 9441292939.